ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 24 అక్టోబరు 2025 | 5



కామాంధుడి కథ ముగిసింది



నారాయణరావు మృతదేహం

- తునిలో బాలికపై అత్యాచారం చేసిన నిందితుడి మృతి
- పోలీసుల నుంచి తప్పించుకుని చెరువులో దూకిన నిందితుడు
- న్యాయాధికారి వద్దకు తరలిస్తుండగా అర్ధరాత్రి సమయంలో ఘటన
- రాత్రి చెరువులో పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలించినా దొరకని ఆచూకీ
- గురువారం ఉదయం చెరువు మధ్యలో వలకు చిక్కిన మృతదేహం

(కాకినాడ/తునిరూరల్, ఆంధ్రజ్యోతి)

బాలికను చెరచిన కామాంధుడి కథ ముగిసింది.. తాతయ్యనంటూ బాలికపై పలుసార్లు అత్యాచారం చేసి అరెస్టయిన నిందితుడి కథ కంచికి చేరింది. చేసిన పాపానికి కటకటాల్లో శిక్ష అనుభవించాలన్న భయమో.. లేదంటే సభ్య సమాజానికి తన నిజరూపం బయట తెలిసిపోయిందన్న అవమానమో చివరకు నిందితుడు నారాయణరావు పోలీసులనుంచి తప్పించుకుని ప్రాణాలు కోల్పోయాడు. చెరువులోకి దూకి పాపం పండించుకున్నాడు. చివరికి ఈ కామాంధుడి మరణం సొంత రక్తసంబధీకులను సైతం కంటతడి పెట్టించలేదు. కనిపెంచిన తండ్రి పాపాలపుట్ట బద్దలై పైకి పోవడమే మంచిదయిందంటూ ఆగ్రహంగా పేర్కొనడం నిందితుడిపట్ల కుటుంబంలోను ఏస్థాయిలో ఏవగింపు కలిగించిందో చాటుతోంది. బాలికను చెరచిన ఇలాంటి వ్యక్తి చనిపోవడమే మంచిదంటూ ఆగ్రహం వ్యక్తం చేసేలా వారంతా వ్యాఖ్యానించడం నారాయణరావు చేసిన తప్పు ఎలాంటిదనేది చాటుతోంది. సదరు నిందితుడి మృతదేహాన్ని తీసుకోవడానికి కుటుంబీకులు సైతం ముందుకురాకపోవడం విశేషం. తొండంగి తోటలో బాలికను అత్యాచారం చేసిన వీడియోను సోషల్ మీడియాలో పోస్టుచేయడంతోపాటు పలు తప్పుడు పోస్టులు షేర్ చేయడంపై వైసీపీ మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అనుచరుడు గణేశుల వీరబాబును పోలీసులు అరెస్ట్ చేశారు.

(మిగతా 7వ పేజీలో)



ఇంటి నుంచే పని.. చేసేయొచ్చు!

నిరుద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోం కింద ఉద్యోగాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. నిరుద్యోగుల ఆశలను చిగురింపచేస్తూ వర్క్ ఫ్రమ్ హోం కౌశలం సర్వేలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు త్వరలోనే ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఐటీ కంపెనీలు ఒక్కొక్కటిగా రాష్ట్రానికి తరలివస్తున్నాయి. ఈ తరుణంలో ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసుకున్న వేలాదిమంది నిరుద్యోగులు చిరుద్యోగిగానైనా ఆయా మల్టీ నేషనల్ కంపెనీల్లో అవకాశం కల్పిస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు.

- నిరుద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోంకు ఏర్పాట్లు
- త్వరలోనే ఆన్‌లైన్ పరీక్షలకు సన్నాహం
- సచివాలయాలకు వెబ్ కెమెరాలు, హెడ్‌సెట్‌లు పంపిణీ

అమలాపురం రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా వేలసంఖ్యలో అభ్యర్థులు కౌశలం సర్వేలో దరఖాస్తు చేసుకున్నారు. నిరుద్యోగులకు సచివాలయాల వారీగా పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఇప్పటికే జిల్లా కేంద్రం నుంచి పరీక్షల నిర్వహణలో భాగంగా సచివాలయాలకు వెబ్ కెమెరాలు, హెడ్‌సెట్‌లను పంపిణీ చేశారు. త్వరలోనే పరీక్షల నిర్వహణకు సంబంధించిన సమాచారం విడుదలయ్యే అవకాశం ఉంది. వర్క్‌ఫ్రమ్ హోం కింద కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ఏర్పాట్లు చేస్తుండడం పట్ల వారంతా ఆశగా ఎదురు చూస్తున్నారు.

రెండు విడతలుగా సర్వే

వర్క్‌ఫ్రమ్ హోం సర్వేలో భాగంగా తొలి విడత గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఇంటింటా సర్వే నిర్వహించారు. విద్యార్హతలను బట్టి వర్క్ ఫ్రమ్ హోం కింద ఏ తరహా ఉద్యోగాలు చేయాలనుకుంటున్నారో నమోదు చేశారు. పదో తరగతి నుంచి డిగ్రీ, పీజీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్‌తోపాటు వివిధ విద్యార్హతలు ఉన్న అభ్యర్థుల సమాచారాన్ని సమగ్రంగా తొలివిడతలో సేకరించారు. తొలి విడతలో నిర్వహించిన వర్క్‌ఫ్రమ్ హోం సర్వే కింద ఉద్యోగాలు చేసేందుకు జిల్లాలో కొందరు నిరుద్యోగులు ఆమోదం తెలిపారు. వారి సమగ్ర సమాచారాన్ని ఈ ఏడాది ఆగస్టు నెలలో రెండోదశలో సేకరించారు. ఎవరెవరు ఏం చదువుకున్నారో తెలుసుకుని వారి సర్టిఫికెట్లను సైతం ఆన్‌లైన్ చేశారు. నిరుద్యోగ అభ్యర్థులకు తెలిసిన భాషలు ఎన్ని, విద్యార్హతలు, ఏమైనా స్పెషలైజేషన్ కోర్సు పూర్తి చేశారా, వచ్చిన మార్కులు, ఏ ఏడాదిలో ఉత్తీర్ణులయ్యారో తెలుసుకుని వివరాలు అన్నింటినీ సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్ చేశారు.

సచివాలయశాఖ ఆధ్వర్యంలో పరీక్షలు

కౌశలం సర్వేలో వర్క్‌ఫ్రమ్ హోం కింద దరఖాస్తు చేసుకున్న వారికి జిల్లా గ్రామ, వార్డు సచివాలయశాఖ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. త్వరలోనే పరీక్షల నిర్వహణ వివరాలను వెల్లడించే అవకాశం ఉంది. ప్రభుత్వం పలు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని వారి సహకారంతో ఈ పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా ఐటీ సెక్టార్‌పై దృష్టి సారించినట్టు తెలిసింది. ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న అభ్యర్థులు వర్క్‌ఫ్రమ్‌హోం కింద ఉద్యోగావకాశాలు మెండుగా కల్పించే అవకాశం ఉందంటున్నారు. దీనిలోభాగంగానే ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్నవారి ఇళ్ల వద్ద బ్రాడ్‌బ్యాండ్ కనెక్టవిటీ ఉందా, దాని స్పీడ్ వివరాలు, వర్క్ ఫ్రమ్ హోం ఉద్యోగం చేసుకోవడానికి ఇంట్లో ప్రత్యేక గది ఉందా, అదే గదిలో మరికొందరు పనిచేసుకునే అవకాశం ఉదా అన్న వివరాలను సైతం ఇప్పటికే సేకరించారు.

ఏ జిల్లాలో ఎందరు..

తొలి, రెండో దశల్లో మొత్తం సర్వే చేసిన వారి వివరాలు ఇలా ఉన్నాయి.

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 4,23,533 గృహాల్లో 9,34,989మంది చదువుకున్నవారు ఉన్నారు. వీరిలో 920791 మందిని సర్వేచేయగా 1,93,564మంది ఉద్యోగాల్లో ఉన్నారు. వీరిలో 14,865మంది వర్క్‌ఫ్రం హోంలో పనిచేస్తున్నట్టుగా గుర్తించారు.
- కాకినాడ జిల్లాలో 5,35,791 గృహాల్లో 11,79,587మంది చదువుకున్నవారు ఉన్నారు. వీరిలో 11,58,593మందిని సర్వే చేయగా 2,15,845మంది ఉద్యోగాల్లో ఉన్నారు. వీరిలో 19,628మంది వర్క్‌ఫ్రం హోంలో పనిచేస్తున్నట్టుగా గుర్తించారు.
- తూర్పుగోదావరి జిల్లాలో గృహాల్లో 463680మంది చదువుకున్నవారు ఉన్నారు. వీరిలో 10,19,051మందిని సర్వే చేయగా 10,01,395మంది ఉద్యోగాల్లో ఉన్నారు. వీరిలో 18,844మంది వర్క్‌ఫ్రం హోంలో పనిచేస్తున్నట్టుగా గుర్తించారు.



వానే.. వాన!

- అల్పపీడనంతో జిల్లాలో వర్షాలు
- నేడు వాయుగుండంగా మారొచ్చు
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారుల హెచ్చరిక
- అత్యధికంగా తాళ్లరేవులో 62.0.. అత్యల్పంగా యు.కొత్తపల్లిలో 4.2 మిల్లీమీటర్ల వర్షం
- మరో మూడురోజులపాటు వర్షాలు కురవొచ్చు
- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం.. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

వానే వాన.. జిల్లాలో గురువారం వర్షం జోరున కురిసింది. ఈ ధాటికి రహదారులు జలమయమయ్యాయి. కాగా, మరో రెండు, మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసింది.

కాకినాడ/కలెక్టరేట్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా గురువారం భారీవర్షాలు కురిశాయి. జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలలో నీరు చేరింది. పంటకాల్వలు పొంగి ప్రవహించడంతో శివారు ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. జిల్లాలోని కాకినాడ నగరంతోపాటు పిఠాపురం, సామర్లకోట, గొల్లప్రోలు, పెద్దాపురం, కాజులూరు, పెదపూడి, కొత్తపల్లి, మెట్టప్రాంతమైన తుని, ఏలేశ్వరం, జగ్గంపేట, కిర్లంపూడి, ప్రత్తిపాడుల్లో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.

పంటచేల మునక

భారీవర్షాలవల్ల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పంటచేలు ముంపునకు గురయ్యాయి. అకాలవర్షాలకు పంటలపై తెగులు సోకే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముంపునీరు దిగేందుకు నడుం బిగించి చేల మధ్యలో బరులు చేసుకుని సమీపంలోని బోదెల్లోకి, పల్లపు ప్రాంతాలకు నీటిని తరలించే పనిలో వారు నిమగ్నమయ్యారు.

నాలుగైదురోజులపాటు

అల్పపీడనం శుక్రవారం మధ్యాహ్నం నాటికి నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఆ తర్వాత అది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ రాగల 24 గంటల్లో బలపడే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో జిల్లాలో మరో నాలుగైదు రోజులపాటు భారీవర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉంటుందని అమరావతి వాతావరణశాఖ వెల్లడించింది. తీరప్రాంతం అల్లకల్లోలంగా మారింది. మధ్యాహ్నంనుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. గంటకు గరిష్ఠం గా 50కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉండడంతో తీర ప్రాంతాల్లో అలజడి నెలకొంది. ఈనెల 25వతేదీ వరకు కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ ప్రాంతాల్లోని అనేకచోట్ల ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు పడనున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా మారడంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసి వారిని అప్రమత్తం చేశారు.



కాజులూరు మండలం కోలంకలో పడిపోయిన వరి పంటను నిలబెట్టి కడుతున్న రైతు



గొల్లప్రోలులో జోరుగా కురుస్తున్న వర్షం

జిల్లాలో నమోదైన వర్షపాతం

జిల్లాలో గురువారం 23.7 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తాళ్లరేవులో 62.0 మిల్లీమీటర్లు, అత్యల్పంగా యు.కొత్తపల్లి మండలంలో 4.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెదపూడిలో 58.8 మిల్లీమీటర్లు, కాకినాడ అర్బన్‌లో 58.4, సామర్లకోటలో 41.4 మిల్లీ మీటర్లు, పెద్దాపురంలో 38.8 మిల్లీమీటర్లు, కరపలో 32.4, కాజులూరులో 31.8, కాకినాడ రూరల్‌లో 28.4 మిల్లీ మీటర్లు, రౌతులపూడిలో 21.2, తునిలో 17.4, గొల్లప్రోలులో 16.8, తొండంగిలో 16.6 పిఠాపురంలో 14.2, జగ్గంపేటలో 12.4, ప్రత్తిపాడులో 12.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



కపిలేశ్వరపురం మండలం టేకిలో వాన ధాటికి నేలనంటిన వరిచేను



ముమ్మిడివరంలో సబ్ ట్రెజరీ కార్యాలయంలోకి ప్రవేశించిన వర్షపునీరు

0884-2356801 భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు23(ఆంధ్రజ్యోతి: అల్పపీడన ప్రభావంతో రెండురోజులుగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం తెలిపారు. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాఅధికారులు, నియోజకవర్గ అధికారులు, తహసీల్దార్లు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. రైతులను అప్రమత్తం చేసి వారికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. కూలిపోయే స్థితిలో వున్న భవనాలకు ప్రజలను దూరంగా ఉంచాలన్నారు. వర్షాల వలన ఎలాంటి ఇబ్బందులు ఏర్పడినా, రోడ్లు తెగిపోయినా, చెట్లు కూలినా, ట్రాఫిక్ ఇబ్బందులు కలిగినా కలెక్టరేట్‌లోని ఉన్న కంట్రోల్ రూమ్ నెంబరు 0884-2356801కు ఫిర్యాదు చేయాలన్నారు. ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాల్లో కూడా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని కలెక్టర్ చెప్పారు. కంట్రోల్ రూముల్లో ఆయా తేదీల్లో అందుబాటులో ఉండే అధికారుల మొబైల్ నెంబర్లు

24వ తేదీ: అహ్మద్ ఉన్నీసా: 9391957377, జాకబ్: 8790723382, వి.తట్టేలు: 9000547852

25వతేదీ: ఎస్.శ్యామల: 9989468610, బీవీఎస్ హర్షిత: 9949916449, కె.సురేష్ కుమార్: 8247655141

26వతేదీ: టి.లోహిత్‌సాయిశ్రీనివాసు: 9492119552, పి.దుర్గాప్రసాద్: 9398055733, జీఎస్ఎస్ శ్రీధర్: 9491343550

27వతేదీ: ఎ.సాయిదీపిక: 7997672438, ఎ.అప్పలనాయుడు: 6301109905, కె.సతీష్‌నాయుడు: 9515950989

వాడపల్లి ఏటిగట్టు రోడ్డుకు రూ.6కోట్ల నిధులు

7

- మంజూరు చేసిన డిప్యూటీ సీఎం పవన్



మంగళగిరిలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో పవన్‌కల్యాణ్‌కు విన్నవిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

ముంపులో 428 హెక్టార్ల వరి పంట

- 37 గ్రామాల్లో పంట పొలాలకు ఎఫెక్ట్
- ఆందోళనలో అన్నదాతలు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండురోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు వరి పంటలు ముంపునకు గురయ్యాయి. డెల్టా పరిధిలోని పెదపూడి, తాళ్లరేవు, కాజులూరు, సామర్లకోట, కిర్లంపూడి మండలాల్లో పంటలు నేలకొరిగాయి. జిల్లావ్యాప్తంగా 37 గ్రామాల్లో 428 హెక్టార్ల వరి పంట ముంపు బారిన పడింది. 709మంది రైతులకు నష్టం వాటిల్లింది. కొన్ని మండలాల్లో వరి పాలుపోసుకునే దశలో, మరికొన్ని మండలాల్లో గింజ గట్టిపడే దశలో ఉంది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మెట్ట పరిధిలో పంటలకు మేలు

రెండురోజులుగా కురుస్తున్న వర్షాలు మెట్ట పరిధిలోని తుని, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం మండలాల్లో ఉద్యాన పంటలకు మేలు చేస్తుందని వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నారు. మెట్టలో బొప్పాయి, మొక్కజొన్న, వేరుశనగ, ఇతర ఉద్యాన పంటలు సాగు చేశారు. ఈ వర్షాలకు అవి ఏపుగా పెరిగి దిగుబడులు పెరుగుతాయని అధికారులు వెల్లడించారు. భారీ వర్షాల నేపథ్యంలో గండేపల్లి మండలంలో ఐదురోజులు కోతలు కోయవద్దని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. వర్షం తగ్గాక కోతలు కోసి ఒబ్బిడి చేసుకోవచ్చన్నారు. ఇదే మండలంలో కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని బరకాలు కప్పి సంరక్షించుకోవాలని అంటున్నారు. భారీ వర్షాలకు ప్రవాహంగా వచ్చిన నీరు వరిపొలాల్లో నిల్వ ఉండకుండా రైతులు తక్షణం చర్యలు చేపటాలని వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ సూచించారు. పడిపోయిన చేనును పైకిలేపి కట్టాలని, గట్లకు గండ్లు పడితే ఎప్పటికప్పుడు పూడ్చివేయాలని తెలిపారు. మండలాల్లో ఏడీఏలు, ఏవోలు అందుబాటులో ఉన్నారన్నారు.

'వ్యవసాయ పంటలను సంరక్షించాలి'

భారీవర్షాలతో ముంపునకు గురైన పంటలను సంరక్షించాలని వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ రాజశేఖర్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం ప్రత్యేక ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లాలో వరితోపాటు ఇతర పంటల పరిస్థితిపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. వరి పంట పాలుపోసుకునే, గింజకట్టే దశలో ఉండటంతో ఈదురుగాలులకు పడిపోతే వాటిని పైకి లేపి కట్టాలని సూచించాలన్నారు. వ్యవసాయశాఖ జేడీతోపాటు ఏడీఏలు, ఏవోలు పంటపొలాలను పరిశీలించి రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా కాలువలకు గండ్లు పడితే ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో వాటిని పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

ఆదేశించిన వ్యవసాయశాఖ జేడీ

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని వ్యవసాయ అధికారులందరూ రైతులకు అందుబాటులో ఉండాలని ఆ శాఖ జేడీ విజయ్‌కుమార్ ఆదేశించారు. జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం నుంచి గురువారం ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో రైతులకు అధికారులు అందుబాటులో ఉండి వారికి సూచనలు ఇవ్వాలన్నారు. ముంపులో ఉన్న పంటలను రక్షించుకునే విధానాలను రైతులకు వివరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఏడీఏలు, ఏవోలు పాల్గొన్నారు.



పంపా రిజర్వాయర్‌నుంచి వరద కాలువ ద్వారా సముద్రంలోకి విడుదలవుతున్న నీరు

పంపా జలాలు సముద్రంలోకి విడుదల

అన్నవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాలకు పంపా రిజర్వాయర్‌లో ఒక్కసారిగా ఇన్‌ఫ్లో పెరగడంతో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో గురువారం పంపా రిజర్వాయర్ నుంచి ముందుజాగ్రత్త చర్యగా నీటిని వరద కాలువ ద్వారా సముద్రంలోకి విడుదల చేశారు. ప్రస్తుతం పంపా నీటిమట్టం 99.7 అడుగులు ఉండగా 450 క్యూసెక్కులు నీరు ఇన్‌ఫ్లో ఉండడంతో అంతే నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. నీటిమట్టం 99 అడుగులు నిర్వహించాలని నిర్ణయించడంతో ఈ రెండురోజుల్లో ఇన్‌ఫ్లో ఆధారంగా నీటిని విడుదల చేసే క్యూసెక్కులు పెంచుతామని, ఒక్కసారిగా వదిలతే రైతులకు ఇబ్బంది అని అధికారులు తెలిపారు.

పన్ను కట్టని ఖాళీ స్థలాల జప్తునకు రంగం సిద్ధం

- రేపటికల్లా ఖాళీ స్థలాలు, కుళాయిల పన్నులు చెల్లించాలి
- కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్, కలెక్టర్ షాన్‌మోహన్
- జిల్లా వెబ్‌సైట్‌లో, సచివాలయాల్లో పన్ను చెల్లించని వారి జాబితా

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో పన్ను చెల్లించని ఖాళీ స్థలాల జప్తునకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఖాళీ స్థలాలు, కుళాయిలకు ఆదివారంలోపు పన్ను చెల్లించకపోతే కఠిన చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్, కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఖాళీ స్థలాల పన్ను, యాజమానుల వివరాలు, బకాయి పన్ను వివరాలను కాకినాడ జిల్లా అధికారిక కార్పొరేషన్ సర్వీస్ విభాగం వెబ్‌సైట్ (https://kakinada.ap.gov.in)లో పొందుపరిచారు. నిర్దిష్ట గడువులోపు పన్ను చెల్లించకపోతే సంబంధిత ఖాళీ స్థలాలను 22(ఎ) నిషేధిత జాబితాలో చేర్చడంతోపాటు అసెస్మెంట్ రద్దుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పన్ను చెల్లింపు కేంద్రాలు: సిటీ సివిక్ సెంటర్, పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం.. శారదా దేవి గుడి వెనుక ఉన్న కార్పొరేషన్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగం సమీప వార్డు సచివాలయాలు



సువర్ణోదయం..!

తెలతెలవారుతుండగా ఆకాశం సువర్ణమయంగా మారి కనువిందు చేసింది. మేలిమి ఛాయలో ఆకాశం మధ్యమధ్యలో నల్లని మబ్బులతో ఈ ఈ అద్భుత దృశ్యాన్ని చూసిన వారు ఆశ్చర్యానికి గురయ్యారు. అల్లూరి సీతా రామరాజు జిల్లా ఎటపాక మండలం గన్నవరం గ్రామంలో గురువారం ఈ దృశ్యం 'ఆంధ్రజ్యోతి' కంటపడింది.

- ఎటపాక (ఆంధ్రజ్యోతి)



మేఘాల పరదా!

మేఘాల పరదా పంటపొలాలపై దుప్పటిలా పరచుకున్నట్టుంది కదూ..! దట్టంగా అలముకున్న నల్లని మేఘా లు ఆకాశం నుంచి వరిచేనుపైకి దిగుతున్నట్టున్నాయి.. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పంట పొలాల మీదుగా గురువారం కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

- గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి)

క్లాస్ రూం టు అసెంబ్లీ

మాక్ అసెంబ్లీ నిర్వహణ ద్వారా శాసనసభలో అడుగుపెట్టే అరుదైన అవకాశాన్ని విద్యార్థులకు కూటమి ప్రభుత్వం కల్పిస్తోంది. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహిస్తోంది. సర్కారు అందిస్తున్న ఈ లక్కీ చాన్స్‌ను వినియోగించుకునేందుకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు.



- అసలు వదల'మాక్'ండి
- అసెంబ్లీ సమావేశాలు ప్రత్యక్షంగా చూసేందుకు విద్యార్థులకు అరుదైన అవకాశం
- పాఠశాల, మండల, నియోజకవర్గ స్థాయిల్లో పోటీల నిర్వహణ





తుని మండలం తేటగుంట జడ్పీ హైస్కూల్లో వక్తృత్వ పోటీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

చట్టసభలంటేనే మన తలరాతను మార్చే గొప్ప ప్రదేశం. అదే అసెంబ్లీ.. అక్కడ జరిగే చర్చలు, తీర్మానాలు.. చట్టాలు చేయడం వంటివి ప్రత్యక్షంగా అక్కడే ఉండి చూడాలని చాలామందికి ఉంటుంది. స్పీకర్ అధ్యక్షతన జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఏయే అంశాలపై చర్చిస్తున్నారు? ఏ విషయాలకు సభ్యులు ఆమోదం తెలుపుతున్నారు?.. అధికార ప్రతిపక్షాల మధ్య వాగ్వాదాలు.. స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలపడం.. వాకౌట్లు, ఒకరిపై ఒకరు విమర్శ లు? వంటి ఎన్నో ఆసక్తికర సంఘటనలకు ఈ సమావేశాలు వేదికగా నిలుస్తాయి. మరీ ముఖ్యంగా మన నియోజకవర్గ ఎమ్మెల్యేలు ఏం మాట్లాడుతున్నారా? స్థానిక సమస్యలపై గళం వినిపించారా లేదా? ఇలాంటి అనేక విషయాలను ఆసక్తిగా గమనిస్తాం. ఒకప్పుడు అసెంబ్లీ సమావేశాల ప్రత్యక్ష ప్రసారాలను ఎంతో ఇష్టంగా చూస్తూ చాలా మంది సీనియర్ సిటిజన్లు టీవీలకు అతుక్కుపోయేవారు. ఇప్పుడు అరచేతిలోకి అంతర్జాలం అందుబాటులోకి వచ్చేయడంతో సెల్ ఫోన్లలోనే సమావేశాల తీరును గమనిస్తున్నారు.

అయితే రాష్ట్ర పాలనలో కీలకమైన అసెంబ్లీలోకి అడుగుపెట్టే అరుదైన అవకాశాన్ని విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల విద్యా ర్థులకు కల్పిస్తోంది. నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిలో నిర్వ హిం చే మాక్ అసెంబ్లీలో పాల్గొనే అవకాశం విద్యార్థులకు కల్పించేలా ఏర్పాట్లు చేస్తోంది.

ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించేందుకు పోటీలు నిర్వ హి స్తు న్నా రు. వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు పాఠశాల,మండల, నియోజకవర్గ స్థాయిల్లో నిర్వహించనున్నారు. వీటిలో ఎంపికైన వారికి అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు.

ఎవరు అర్హులంటే...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1582, కాకినాడ జిల్లాలో 1017, తూర్పు గోదావరి జిల్లాలో 982 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 3.25లక్షల మంది మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో 8, 9, 10 తరగతులు చదివే వారు సుమారు లక్ష వరకు ఉంటారు. వీరిలో ఆసక్తి, ఉత్సాహవంతులైన విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఇప్పటికే మంగళ, బుధవారాల్లో పాఠశాల స్థాయిలో ఈ పరీక్షలు జరిగాయి. ఈ నెల 24, 25 తేదీల్లో మండల స్థాయిలో ఆయా స్కూళ్ల పరిధిలో జరగనున్నాయి. వీటిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 29, 30 తేదీల్లో జరిగే పోటీలకు పంపుతారు. అక్కడ ఎంపికైన అభ్యర్థులను శిక్షణకు పంపిస్తారు.

ముందుగానే శిక్షణ

ఆయా పోటీల్లో విజేతలుగా నిలిచేవారికి మాక్ అసెంబ్లీలో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. కాకినాడ జిల్లాలోని కాకినాడ సిటీ, రూరల్, పెద్దాపురం, జగ్గంపేట, పిఠాపురం, ప్రత్తిపాడు, తుని... ఏడు నియోజకవర్గాల నుంచి ఎంపికైన వారికి అమరావతిలో ముందుగానే శిక్షణ ఇస్తారు. అసెంబ్లీలో మాదిరిగానే సీఎం, డిప్యూటీ సీఎం, స్పీకర్, ఎమ్మెల్యేలుగా విద్యార్థులే వ్యవహరిస్తారు. మాక్ అసెంబ్లీ సాక్షిగా విద్యార్థులు తమలోని ప్రతిభను చాటుకునే అవకాశం దక్కనుంది. ఈ మొత్తం పోటీలను పర్యవేక్షించే బాధ్యతను పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయులకు, మండలస్థాయిలో ఎంఈవోలకు, డీవైఈవోలకు. నియోజకవర్గ స్థాయిలో డీఈవో, డీవైఈవోలకు అప్పగించారు.

ఏయే టాపిక్‌లు అంటే..

స్కూలు స్థాయిలో 'లోకల్ సెల్ఫ్ గవర్నెన్స్' పై వ్యాసరచన, 'మై ఫేవరెట్ ఫ్రీడం ఫైటర్' అంశంపై వక్తృత్వం, మండల స్థాయిలో 'సివిల్ రైట్స్ అండ్ సిటిజన్ రెస్పాన్సిబులిటీ' అంశంపై వ్యాసరచన, 'మేకింగ్ అండ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ యాక్ట్స్ ఫర్ హ్యూమన్' అంశంపై వక్తృత్వం, 'ద ఇండియన్ ఫ్రీడం ఫైట్' అంశంపై క్విజ్ పోటీలు జరుగుతాయి. నియోజకవర్గ స్థాయిలో 'హిస్టరీ బిహైండ్ మేకింగ్ ఆఫ్ ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ (రాజ్యాంగ రూపకల్పన వెనుక చరిత్ర) అంశంపై వ్యాసరచన, 'మేకింగ్ ఇండియా ద్వారా వికసిత్ ఆంధ్రప్రదేశ్' అంశంపై వక్తృత్వం, భారత రాజ్యాంగంపై క్విజ్ పోటీలు జరగనున్నాయి.

29న క్రీడాకారుల ఎంపిక

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 29న పురుషులు, మహిళల జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్టు కాకినాడ జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్‌టెన్నిస్, స్విమ్మింగ్, ఖోఖో, టేబుల్‌టెన్నిస్, వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, వాలీబాల్, యోగా, రెజ్లింగ్ క్రీడాంశాల్లో 29వ తేదీ ఉదయం 9 గంటలకు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఎంపికలు ప్రారంభమవుతాయి. (ఓపెన్) నాన్ యూనిఫాం ప్రభుత్వ ఉద్యోగులై ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగి గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్, ఇటీవల తీయించుకున్న పాస్‌పోర్టు సైజు ఫొటో ఒకటి తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. అభ్యర్థులకు ఎటువంటి టీఏ, డీఏ ఇవ్వరు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోగా ఏపీ క్రీడల్లో పాల్గొంటారో స్వయంగా లేదా dsakakinada 2023@gmail.com మెయిల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

నేడు కాకినాడలో 'ఏఐ ఫ్యూజన్' సదస్సు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని వివేకానంద పార్కు సమీపంలో గల గోదావరి కళాక్షేత్రంలో 'ఏఐ ఫ్యూజన్-2025' పేరిట గోదావరి ప్రాంతంలో తొలి కృత్రిమ మేథస్సు సదస్సును శుక్రవారం నిర్వహించనున్నారు. పరిశ్రమల యజమానులు, ఆవిష్కర్తలు, స్టార్టప్స్, పరిశోధకులు ఏఐ రంగంలోని తాజా ధోరణులు, భవిష్యత్ అవకాశాలపై చర్చించనున్నారు. స్టార్టప్స్ విభాగంలో ప్రతిభ కనబరిచిన వారికి ఏఐ ఇనోవేషన్ అవార్డులు ప్రదానం చేసి గౌరవించనున్నారు. 2026 ఫిబ్రవరిలో జరిగే జాతీయ స్థాయి ఏఐ ఫ్యూజన్ సదస్సులో దేశవ్యాప్తంగా 38 ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని నిర్వాహకులు చెప్పారు.





మహా సంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభుడు (పైన) పాదగయ క్షేత్రంలో స్వయంభూ దత్తాత్రేయస్వామి (ఎడమ)

నేటి నుంచి పాదగయలో
దత్త దీక్షల స్వీకరణ

మహా సంస్థానంలో వచ్చే నెల 28 నుంచి దత్తజయంతి సప్తాహ మహోత్సవాలు

పిఠాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసియున్న స్వయంభూ శ్రీపాదశ్రీవల్లభ దత్తాత్రేయస్వామి సన్నిధిలో దత్త జయంతి సందర్భంగా శుక్రవారం దత్త మహామండల దీక్ష ప్రారంభించనున్నారు. భక్తులు సర్వాభీష్టసిద్ధికై దీక్ష చేపట్టవచ్చని ఆలయ వేదపండితులు తెలిపారు. శుక్రవారం ఉదయం ఆరు గంటలకు భక్తులకు మాలధారణ ప్రారంభమవుతుంది. అర్ధ మండల దీక్షకు నవంబరు 12న, సప్తాహ దీక్షకు నవంబరు 26న మాలధారణ జరుగుతాయి. డిసెంబరు 3న ఇరుముడి ధారణ, అదేరోజు సాయంత్రం దత్తస్వాముల నగరోత్సవం, డిసెంబరు 4న దత్త జయంతి సందర్భంగా తెల్లవారుజామున శ్రీదత్త దీక్షా విరమణ, మహా పూర్ణాహుతి, స్వామికి మహాపూజ నిర్వహిస్తారు. విఠలానంద మహారాజ్ ఆశీస్సులతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా దత్తసాయి సేవా సమితి అధ్యక్షుడు వాడ్రేవు శ్రీనివాసరావు గురుస్వామి మాలధారణ చేస్తారు. దత్త దీక్షల స్వీకరణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు.

పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో నవంబరు 28 నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు జరగనున్నాయి. ఇందులో పాల్గొనేందుకు ఉత్తరాది, మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీ, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా తరలిరానున్న నేపథ్యంలో అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లు ప్రారంభించారు. దత్త జయంతి సప్తాహ మహోత్సవాల్లో ప్రతిరోజూ మహా గణపతి పూజ, కలశస్థాపన, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మములకు మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్రనామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, వేదపారాయణ, రుత్విక్కులచే మూలమంత్ర అనుష్ఠానం, గణపతి అథర్వ శీర్ష ఉపనిషత్ పారాయణ, గురుచరిత్ర, శ్రీపాదశ్రీవల్లభ చరితామృత పారాయణ, సాయంత్రం నాలుగు గంటలకు అగ్నిప్రతిష్ఠాపన, దత్త మంత్ర హోమం, ఐదు గంటలకు శ్రీపాదశ్రీవల్లభుల దివ్యపాద పద్మములకు వివిధ హారతులు, స్వామివారికి పల్లకీ సేవ, సాయంకాలార్చన, మంగళహారతి జరుగుతాయి. నవంబరు 28న దత్తాత్రేయస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తారు. అదేరోజు సర్వపుష్పపూజ, 29న లక్ష బిల్వార్చన, 30న సహస్ర చామంతి పూజ, డిసెంబరు 1న లక్ష తులసి అర్చన, 2న సహస్ర లిల్లీ పుష్ప పూజ, 3న గులాబీ అర్చన, సంపెంగ పుష్ప పూజ, 4న పూలంగి సేవ, బిల్వార్చన, పూర్ణాహుతి జరుగుతాయి. ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో ఆర్.సౌజన్య చెప్పారు.



వెండి నాగాభరణం అందజేస్తున్న వెంకట సతీష్-స్వాతి దంపతులు

రాచపల్లి అరుణాచలేశ్వరునికి వెండి నాగాభరణం బహూకరణ

ప్రత్తిపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలోని అరుణాచలేశ్వరస్వామికి కాకినాడకు చెందిన గుంటి వెంకటసతీష్-స్వాతి దంపతులు, వారి కుమార్తె జ్యోత్స్న రూ.20లక్షలు విలువచేసే వెండి నాగాభరణం చేయించారు. గురువారం దానిని ఆలయ వ్యవస్థాపకుడు స్వామి రమణానందకు అందజేశారు. అనంతరం నాగాభరణాన్ని వేదపండితుల మంత్రోచ్ఛారణలతో అరుణాచలేశ్వరునికి అలంకరించారు. కార్తీక మాసం రెండో రోజు స్వామికి పంచామృత అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన జరిపి పంచ హారతులు ఇచ్చారు.



వెండి నాగాభరణాన్ని స్వామికి అలంకరించిన దృశ్యం

సామర్లకోటలో రైల్వే డీఆర్‌ఎం

రైల్వే ట్రాక్, ముంపు ప్రాంతాల పరిశీలన

సామర్లకోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ మోహిత్ సోనాకియా గురువారం సామర్లకోట విచ్చేశారు. మూడు రోజుల క్రితం వరద నీటితో రైల్వే ట్రాక్ మొత్తం ముంపునకు గురవ్వడంపై 'ఆంధ్రజ్యోతి'లో వరుసగా వచ్చిన కథనాలను ఆయన అధికారుల నుంచి సేకరించారు. ట్రాక్ ముంపు సమస్య, స్తంభించిన సిగ్నలింగ్ వ్యవస్థలపై డీఆర్‌ఎంకు స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్, ఏఈఎన్ ప్రభాకర్, చీఫ్ సిగ్నలింగ్ అధికారి చిరంజీవి సమగ్రంగా వివరించారు. అనంతరం ఆయన అధికారులతో కలిసి ట్రాక్‌ను పరిశీలించారు. రైల్వే స్థలాలతో పాటు పూర్వం నుంచీ ఉన్న పంత మార్గాలు నేడు కనిసించకుండా పోయినందునే ముంపు బెడద తలెత్తుతోందని రైల్వే అధికారులు డీఆర్‌ఎంకు వివరించారు. రైల్వే శాఖకు పూర్వం నుంచీ ఉన్న స్థలాలను సర్వే చేసి శాశ్వత ప్రాతిపదికన డ్రైన్లు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. రైల్వే ట్రాక్ వెంబడి ఉన్న చెరువులకు లీజు పరిమితి 2029 వరకు ఉందని చెప్పగా పరిమితి పూర్తయిన అనంతరం లీజు నిలిపివేయాలని డీఆర్‌ఎం సూచించారు. వివిధ శాఖల అధికారులతో వాస్తవంగా ఉన్న రికార్డుల మేరకు సర్వే చేయించి రైల్వే లేదా ప్రభుత్వ స్థలాల్లో శాశ్వత ప్రాతిపదికన డ్రైన్లు నిర్మించి ట్రాక్ పైకి భవిష్యత్తులో వరద నీరు రాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువు నుంచి తాత్కాలికంగా తవ్విన కాలువను పరిశీలించారు. 3, 4, 5, 6 ట్రాక్‌లపైకి వరద నీరు చేరకుండా ప్రస్తుతం వున్న మూడు మోటార్లతో పాటు మరో రెండు మోటార్లతో వరద నీటిని పంపింగ్ చేసి బయటకు పంపాలని ఏఈఎన్ ప్రభాకర్‌కు సూచించారు.



రైల్వే ట్రాక్ పైకి వరద నీరు చేరకుండా ప్రత్యేకంగా తవ్విన కాలువను చూస్తున్న డీఆర్‌ఎం సోనాకియా

భావనారాయణస్వామి ఆలయ ఈవోగా శ్రీనివాసరావు



సర్పవరం జంక్షన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి (గ్రేడ్-1)గా ఆర్.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఎమ్మెల్యే పంతం నానాజీ సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఆయన చెప్పారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఈవోగా పనిచేసిన తలాటం సూర్యనారాయణని అభినందించారు.

పిఠాపురం పాదగయలో పూజలు

పిఠాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రానికి విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజరు మోహిత్ సోనాకియా దంపతులు గురువారం విచ్చేశారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. వారికి ఆలయ పండితులు క్షేత్ర ప్రాశస్త్యం వివరించి ఆశీర్వచనాలు అందించారు. డీఆర్‌ఎం దంపతులను కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు, స్వామి-అమ్మవార్ల చిత్రపటం అందజేశారు. డీఆర్‌ఎం వెంట సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజరు మద్దింశెట్టి రమేష్, ఆలయ పండితులు వింజమూరి సుబ్రహ్మణ్యశర్మ, అల్లంరాజు చంద్రమౌళి, సూపరింటెండెంట్ వీరభద్రరావు, రెడ్నం ప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దత్తాత్రేయ వున్నారు.



డీఆర్‌ఎం సోనాకియాకు ప్రసాదం అందజేస్తున్న ఈవో జగన్మోహన శ్రీనివాస్

జేఎన్టీయూకే, ఎస్టీబీఐఎఫ్, గోవిన్ హోల్డింగ్స్ మధ్య అవగాహన ఒప్పందం



ఎంవోయూలు మార్చుకుంటున్న జేఎన్టీయూకే వీసీ ప్రసాద్, ఇతర సంస్థల ప్రతినిధులు

జేఎన్టీయూకే, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలోని వైస్ చాన్సలర్ సమావేశ హాల్లో జేఎన్టీయూకే, విశాఖపట్నంలోని ఎస్టీబీఐఎఫ్, సింగపూర్‌లోని గోవిన్ హోల్డింగ్స్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్టు ఎస్ఆర్ఐఐసీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ తెలిపారు. జేఎన్టీయూ ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్, గోవిన్ హోల్డింగ్స్ అధినేత ఆనంద్ గోవిందలూరి, ఏపీ డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ నెట్‌వర్క్ చైర్మన్ శ్రీధర్ కొసరాజు సంతకాలు చేసి అవగాహన ఒప్పంద పత్రాలను ఒకరికొకరు మార్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా ఈ సంస్థలు ఆవిష్కరణాత్మక పరిశోధన, స్టార్టప్ ఎకో సిస్టమ్ అభివృద్ధి, అంతర్జాతీయ మార్కెట్ ప్రవేశానికి వేదికలు సృష్టించడం, గ్లోబల్ సహకార అవకాశాలను అన్వేషించడం వంటి రంగాల్లో పరస్పర సహకారం అందించుకోనున్నాయి. ఈ సందర్భంగా ఆనంద్ గోవిందలూరి సమాజానికి నైతిక స్టార్టప్‌ల ప్రభావం అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు పలువురు డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కామాంధుడి కథ ముగిసింది

(5వ పేజీ తరువాయి)

తుని రూరల్ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికను అత్యాచారం చేసిన నిందితుడు నారాయణరావు (62)ను పోలీసులు బుధవారం సాయంత్రం అరెస్టు చేయగా, అతడి తక్షణం అరెస్ట్‌తో తగిన శాస్తి జరిగిందని అంతా అనుకున్నారు. పోలీసులు సైతం తమకు పక్కా ఆధారాలతో వీడియో దొరకడం, బాధితురాలిచ్చిన వివరాలు, వైద్య పరీక్షల నివేదిక ఆధారంగా నిందితుడు అత్యాచారం చేసినట్లు నిర్ధారణ అవడంతో రిమాండ్‌కు తరలించడానికి ఏర్పాట్లు చేశారు. తుని మేజిస్ట్రేట్ ముందు నిందితుడిని హాజరుపర్చడానికి పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందు కోసం వీడియో సాక్ష్యం, ఎఫ్ఐఆర్, ప్రాథమిక ఆధారాలు సిద్ధం చేశారు. కానీ తుని మేజిస్ట్రేట్ అందుబాటులో లేకపోవడంతో ప్రత్తిపాడు మేజిస్ట్రేట్ వద్ద హాజరుపర్చేందుకు బయలుదేరారు.

బహిర్భూమికి వెళ్లాలని జీపు ఆపి..

రాత్రి పది గంటలకు తునిరూరల్ పోలీసులు నిందితుడిని జీపులో ఎక్కించి ప్రత్తిపాడు మేజిస్ట్రేట్ వద్దకు బయలుదేరారు. కాగా, తాను బహిర్భూమికి వెళ్లాలని జీపు ఆపాలని నిందితుడు కోరాడు. ప్రత్తిపాడులో వెళ్లవచ్చని పోలీసులు చెప్పినా వెంటనే ఆపాలంటూ ఒత్తిడి తెచ్చాడు. దీంతో తుని పట్టణ శివారులోని కోమటి చెరువు వద్ద పోలీసులు జీపు ఆపారు. అదే సమయంలో వర్షం పడుతుండడంతో పక్కనే ఉన్న చెట్టు కిందకు ఎస్కార్ట్ సిబ్బంది వెళ్లి నిలబడ్డారు. ఈలోపు నిందితుడు పక్కనే ఉన్న చెరువులోకి దూకేశాడు. ఒక్కసారిగా శబ్దం విన్న పోలీసులు చెరువులోకి దిగి గాలించే ప్రయత్నం చేశారు. కానీ జాడ కనిపించలేదు. వెంటనే ఫైర్‌సిబ్బందికి ఫోన్ చేయగా వారు కూడా చాలాసేపు వెతికారు. అయినా జాడ కనిపించలేదు. దీంతో ఉదయాన్నే గజ ఈతగాళ్లను పిలిపించి చెరువులో గాలించారు. వలలు వేసి వెతికారు. చెరువు మధ్యలో కరెంట్ స్తంభం సమీపంలో నిందితుడి మృతదేహం వలకు చిక్కింది. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు మృతుడు నారాయణరావుగా నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మరోపక్క నిందితుడు బుధవారం రాత్రి జైలుకి వెళ్లి ఉంటాడని అనుకున్న వారందరికీ గురువారం ఉదయం మృతి వార్త తెలియడంతో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

రోజంతా పోలీసుల బందోబస్తు..

అత్యాచార నిందితుడు నారాయణరావు మృతి చెందడం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గురువారం సంచలనమైంది. నింది తుడు తప్పించుకుని పారిపోయే క్రమంలో చనిపోవడంతో పీడవిరగడైందని చర్చోపచర్చలు జరిగాయి. మరోపక్క నారాయణరావు మృతి సమాచారం తెలియడంతో అతడి కొడుకు, కోడలు, కూతురు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వారెవరూ కనీసం విచారం వ్యక్తం చేయకపోవడం విశేషం. నారాయణరావు చేసిన పాపానికి చనిపోవడమే కరెక్ట్ అంటూ కుటుంబీకులు సైతం అసహ్యించుకున్నారు. నిందితుడికి బుధవారం రాత్రి బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు దేహశుద్ధి చేసినప్పుడే తమకు అతడు చేసిన తప్పు అర్థమై దూరంగా ఉన్నామని వివరించారు. స్టేషన్‌కు పోలీసులు తీసుకువెళ్లినప్పుడు కూడా వదిలేశామన్నారు. అయితే నిందితుడు రాత్రి చనిపోయిన విషయాన్ని దాచేసి కోర్టుకు తీసుకువెళ్లడం కోసం తమవద్ద పోలీసులు సంతకం తీసుకున్నారని కొడుకు, కోడలు వాపోయారు. నిందితుడు చనిపోయాడని రాత్రే నిజం చెబితే తామే సంతకం పెట్టేవాళ్లమని వివరించారు. నిందితుడు చెరువులో దూకిన ప్రాంతం వద్ద పోలీసులు రోజంతా బందోబస్తు నిర్వహించారు. అక్కడ ఎలాంటి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా నిఘా ఉంచారు. నారాయణరావు మృతదేహాన్ని పోలీసులు తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. శవపంచనామా కోసం కుటుంబీకుల్లో ఒకరు సంతకం చేయాలని పోలీసులు కోరినా ఎవరూ ముందుకు రాలేదు. నారాయణకు ఇద్దరు భార్యలున్నారు. వీరిద్దరికీ సమాచారం ఇచ్చినా మధ్యాహ్నం వరకు ఎవరూ మృతదేహం కోసం ముందుకు రాలేదు. దీంతో సాయంత్రం శవపంచనామా పూర్తయింది.

వైరల్ వీడియోపై పోలీసులు రంగంలోకి..

తొండంగి తోటలో నిందితుడు నారాయణరావు మైనర్ బాలికను అత్యాచారం చేసిన వీడియోలు బుధవారం నుంచీ వైరల్ అవుతున్నాయి. ఈ వీడియోలో బాలిక వీడియోలు స్పష్టంగా కనిపిస్తుండడాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణించారు. బాలికలు కనిపించేలా ఇలా వీడియోలు పోస్ట్ చేసిన వారిపై పోలీసులు గురువారం దర్యాప్తు ప్రారంభించారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు వీడియోలు తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని, కానీ ఇలా సోషల్ మీడియాలో వైరల్ చేయడం వల్ల బాలిక భవిష్యత్తుకు ఇబ్బందులు వస్తాయని పోలీసులు హెచ్చరించారు. గురువారం సాయంత్రంలోగా వీటిని సోషల్ మీడియా నుంచి తొలగించాలని బాధ్యులను హెచ్చరించారు. లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కానీ చాలామంది నుంచి స్పందన లేదు. ఈ నేపథ్యంలో వీటిని పరిశీలించిన పోలీసులు గురువారం సాయత్రం వైసీపీ మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ముఖ్య అనుచరుడు గణేశుల వీరబాబు (35)పై కేసు నమోదు చేశారు. అత్యాచార వీడియోలు, నిందితుడి తనయుడు హోంమంత్రి అనిత అనుచరుడిగాను, నిందితుడు మాజీమంత్రి యనమలతోను ఉన్నట్లు మార్ఫింగ్ ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేయడాన్ని గుర్తించిన పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు.

మృతదేహం వద్ద కుటుంబీకుల రోదన


తండ్రి మృతదేహం వద్ద విలపిస్తున్న కుమార్తె

తుని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసులు కళ్లు గప్పి తప్పించుకునే ప్రయత్నంలో కామాంధుడు నారాయణరావు చెరువులో మునిగి బుధవారం రాత్రి మృతిచెందాడు. కాగా, రాత్రి కురిసిన వర్షం కారణంగా బయటకు తీసేందుకు వీలు లేకపోవడంతో గురువారం వేకువజాము నుంచే నారాయణరావు మృతదేహం కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని వెలికితీయడంతో కొడుకు సురేష్, కూతురు నాగలక్ష్మి, కోడలు రాజేశ్వరి మృతదేహం వద్దకు వచ్చారు. అక్కడ ఆందోళన వ్యక్తం చేసిన కొడుకు సురేష్, కోడలు రాజేశ్వరి, తమ తండ్రి చేసిన పనికి శిక్ష పడాల్సిందేనని కానీ చెరువులో పడి చనిపోవడంపై అనుమానాలు ఉన్నాయన్నారు. అనంతరం మృతదేహాన్ని పోలీసులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉంటే అత్యాచారానికి గురైన బాలిక తుని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

గురుకులంలో అధికారుల విచారణ


పాఠశాలలో విచారణ చేపడుతున్న దృశ్యం

తుని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాల విద్యార్థినిపై వృద్ధుడు తాటిక నారాయణరావు అత్యాచారానికి ఒడిగట్టడం సంచలనం రేకెత్తించిన విషయం తెలిసిందే. దీంతో గురుకుల పాఠశాల ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. స్టేట్ సెక్రటరీ మస్తానయ్య, జాయింట్ సెక్రటరీ అబుల్‌దుల్లా, ఇరువురు పాఠశాల ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులతో సమావేశమై బాలిక బయటకు వెళ్లడానికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నారాయణరావు అనే వ్యక్తి బాలిక తాతయ్యగా చెప్పుకుని పలుమార్లు పాఠశాలకు తినుబండారాలు తీసుకురావడంతో పాటు రెండు సార్లు బాలికను బయటకు తీసుకెళ్లాడన్నారు. తాతయ్యగా నమ్మిన సిబ్బంది బయటకు పంపించడం జరిగిందని, విద్యార్థిని కూడా తమ తాతయ్య అని ధ్రువీకరించిందన్నారు.

ప్రమాదవశాత్తు కత్తి తలపై పడి ఒకరి మృతి

నల్లజర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కత్తి జారి తలపై పడిన ఘటనలో కూలీ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన దూబచర్లలో గురువారం చోటుచేసుకుంది. నల్లజర్ల పోలీసుల వివరాలివి... జగన్నాథపురం గ్రామానికి చెందిన పేర్ల నాగేశ్వరరావు (35)కొంతమందితో కలిసి దూబచర్లలో ఆయిల్‌పాం గెలలు కోసేందుకు ఉదయం వెళ్లాడు. కాగా, నాగేశ్వరరావు కత్తితో గెలలు కోస్తున్న సమయంలో ఇనుప గెడకు ఉన్న కత్తి పై నుంచి జారి తలపై పడడంతో తీవ్ర రక్త స్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈయనకు భార్య పద్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

కరిచర్లగూడెం మాతంగమ్మ ఆలయంలో చోరీ

గోపాలపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కరిచర్లగూడెం గ్రామ శివారులో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మాతంగమ్మ ఆలయంలో చోరీకి పాల్పడినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు... గ్రామ శివారులో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఆలయంలో బుధవారం రాత్రి ఆలయంలో చొరబడి ఉన్న డబ్బీని పగలగొట్టి అందులో ఉన్న సొమ్మును అపహరించుకుపోయినట్టు తెలిపారు. ఇటీవలే ఆలయం వద్ద దసరా ఉత్సవాలు నిర్వహించామని, దీంతో రూ. 10 నుంచి 15000 వేలు వరకు హుండీలో అమ్మవారి కానుకలు ఉన్నాయన్నారు. అలాగే గోపాలపురంలోని కనకదుర్గమ్మ వారి ఆలయంలో కూడా బుధవారం రాత్రి చోరీ జరిగినట్టు విశ్వసనీయ సమాచారం.

డిప్యూటీ సీఎంను కలిసిన కొత్తపేట ఎమ్మెల్యే

కొత్తపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం నియోజకవర్గంలో ముఖ్యమైన 12 రోడ్ల నిర్మాణం కోసం రూ.18.33 కోట్ల నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. ముఖ్యంగా రావులపాలెం జాతీయ రహదారి నుంచి వాడపల్లి వరకు ఏటిగట్టు రహదారి నిర్మాణం అవసరమని, దీనికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం దినదిన ప్రవర్తమానంగా వెలుగొందుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకోవాలని ఆహ్వానించారు. అలాగే గోదావరి డెల్టా ఆధునీకరణ పనులు మంజూరు చేయాలన్నారు. వీటిపై పవన్ సానుకూలంగా స్పందించినట్టు ఆయన వివరించారు.

వాడపల్లి క్షేత్రానికి రూ. 6 కోట్లు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతిని గడించిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రానికి డిప్యూటీ సీఎం పవన్ రూ.6 కోట్ల నిధులు మంజూరు చేశారు. గురువారం రాత్రి మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వాడపల్లి క్షేత్రం గురించి వివరించి గోదావరి ఏటిగట్టు రహదారికి నిధులు మంజూరు చేయాలని కోరగా, తక్షణమే స్పం దించి పంచాయతీ రాజ్ ద్వారా నిధుల విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

వాడపల్లి వెంకన్న కొబ్బరి చెక్కల వేలం పాట ఆదాయం రూ.1.63 కోట్లు


వాడపల్లిలోని ఆలయంలో వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

ఆత్రేయపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన వేలం పాటలో స్వామివారికి అధిక ఆదాయం లభించింది. ఏడాది కాలానికి నిర్వహించిన కొబ్బరి చెక్కల వేలం పాటలో సదరు పాటదారుడు రూ.1,63,33,333 హెచ్చుపాటను సొంతం చేసుకున్నాడు. గత ఏడాది రూ.60,77,879కి పలికింది. అలాగే పట్టిక బెల్లంకు నిర్వహించిన వేలం పాటలో రూ. 18,09,000 రాగా, గతంలో రూ.12,35,000, తిరు తిలకధారణకు నిర్వహించిన వేలం పాటలో రూ.17,99,299 రాగా, గతంలో రూ.15,66,666 పాట దక్కించుకున్నారు. అధిక ఆదాయం లభించిన ఈ పాటలలో బహిరంగ వేలం సీల్డ్ టెండర్లు, ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. వేలంలో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే మానసిక ఆరోగ్యం

- కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్
- ఆర్ఎంసీలో డ్రగ్స్ నియంత్రణపై సదస్సు

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడిని అధిగమించడం తద్వారా మానసికంగా, శారీరకంగా ప్రశాంతత లభిస్తుందని కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ అన్నారు. ఆర్ఎంసీలో డ్రగ్స్ నియంత్రణపై గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు (డ్రగ్స్) ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా కుటుంబాలను నాశనం చేస్తున్నాయన్నారు. ప్రస్తుత వైద్య విద్యార్థులు భవిష్యత్తు వైద్యులుగా మారి సమాజానికి ఆదర్శం కావాలన్నారు. మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ వి.వరప్రసాద్ మాట్లాడుతూ ప్రశాంతమైన మనస్సు, ఆరోగ్యవంతమైన శరీరం వైద్య విద్యార్థులకు ముఖ్యమన్నారు. ఆందోళన, ఒత్తిడి సమస్యలకు ఆర్ఎంసీలో కౌన్సిలింగ్‌తో పాటు మెంటల్ హెల్త్ సపోర్ట్ సిస్టం ఉందన్నారు. అవసరమైన వారు మెంటర్స్/అధ్యాపకులు/ కౌన్సిలర్లను సంప్రదించాలన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు తొడిగిన వైట్ కోట్ కరుణ, క్రమశిక్షణ, వినయం ... ముఖ్యంగా సేవాభావాన్ని గుర్తు చేస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయశేఖర్, డాక్టర్ శశి, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్‌శ్రీనివాసన్, డాక్టర్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు యువకులపై పోక్సో కేసు

సౌత్‌జోన్ డీఎస్పీ భవ్య కిషోర్


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ భవ్య

రాజమహేంద్రవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేశారు. ఈ మేరకు వివరాలను సౌత్ జోన్ డీఎస్పీ భవ్యకిషోర్ గురువారం తెలి పారు. సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో ఉంటున్న ఓ బాలిక దీపావళి టపాసులు కొనుక్కోడానికి బయటకు వెళ్లింది. ఆ బాలికతో ముందుగానే పరిచయం ఉన్న పాము అజయ్‌తోపాటు అతడి స్నేహితుడు అదే సమ యంలో హాస్టల్ వద్దకు వచ్చారు. తాము కూడా దీపావళి బాణసం చాకు వెళుతున్నామని మాయమాటలు చెప్పి బాలికను బైక్ ఎక్కిం చుకొని రైల్వే స్టేషను సమీపంలోని శ్రీగురు లాడ్జికి తీసుకెళ్లారు. స్నేహి తుడు లాడ్జి బయట ఉండగా, బాలికను అజయ్ రూమ్‌లోకి తీసుకె ళ్లి అత్యాచారం చేసి, వసతి గృహం వద్ద వదిలి వెళ్లాడని.. బాలిక గాబరా ప్రవర్తనను గమనించి వార్డెన్ ప్రశ్నించగా జరిగిన విషయాన్ని చెప్పినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. దీంతో పోక్సో కేసు నమోదు చేసి అజయ్‌తోపాటు కాగితపల్లి సత్యస్వామిని అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టామన్నారు. శక్తి టీంలను అప్రమత్తం చేశామన్నారు. వసతి గృహాలకు పంపించి కౌన్సెలింగ్ చేయిస్తున్నామన్నారు. లాడ్జి సిబ్బంది, యజమానులు బాధ్యతాయుతంగా నడుచుకోవాలని, అనుమానమొస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ కోరారు. ఉదాసీనంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

- టూటౌన్ పరిధిలో ఇటీవల ఇది రెండో తీవ్రమైన ఘటన కావడం గమనార్హం. నెల క్రితం పోలీస్ స్టేషనుకు సమీపంలోనే రాత్రి గస్తీ విధుల్లో ఉన్న ఒక కానిస్టేబుల్, హోంగార్డుపై అసాంఘిక వ్యక్తులు దాడి చేసి కానిస్టేబుల్‌ని కొట్టారు. జిల్లాలో పోలీసులపై ఇలాంటి ఘటన ఇదే మొదసారి కావడంతో సంచలనమైంది.ఇప్పుడు పోలీస్‌స్టేషన్‌కి కూతవేటు దూరంలోనే ఉన్న లాడ్జిలో అఘాయిత్యం జరిగింది. దీంతో నిఘా పేలవంగా ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పైగా రైల్వేస్టేషను ఏరియా సున్నిత ప్రాంతం కావడంతో స్టేషనుపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలనే వినతులు వినవస్తున్నాయి. కేసులో ప్రతిభ చూపిన సీఐ శివ గణేశ్, ఎస్ఐ శ్యాంసుందర్, హెచ్‌సీ భానుమూర్తి, కానిస్టేబుళ్లు రబ్బాని, మహేశ్‌కుమార్, నాగబాబు, బాలసుబ్రహ్మణ్యాన్ని ఎస్పీ కిషోర్ అభినందించారు.

బాలింత మృతిపై విచారణ

పిఠాపురంలో వైద్యులు, సిబ్బంది, మృతురాలి బంధువుల నుంచి వివరాలు సేకరణ


పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో విచారణ నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

పిఠాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం సామాజిక ఆరోగ్య కేంద్రం (ప్రభుత్వాసుపత్రి)లో బాలింత మృతి ఘటనపై గురువారం విచారణ నిర్వహించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన దొండపాటి శ్రీదుర్గ డెలివరీ నిమిత్తం ఈనెల 13న ఆసుపత్రిలో చేరగా 14న బిడ్డను ప్రసవించిన అనంతరం అధిక రక్తస్రావమై సీరియస్ కావడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ మరణించడం. బిడ్డ అనారోగ్యానికి గురికావడంపై మృతురాలి బంధువులు ఆందోళన నిర్వహించగా, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. దీనితో కలెక్టర్ ఆదేశాల మేరకు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి,గైనిక్ హెచ్‌వోడి డాక్టర్ అనురాగమయి, పిడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ మాణిక్యం, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి, జీజీహెచ్ ఏవో శేషేంద్రశర్మ గురువారం పిఠాపురం చేరుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారణ జరిపారు. మృతురాలి బంధువులు, చికిత్స చేసిన వైద్యులు, సిబ్బంది, ఆ రోజు విధుల్లో ఉన్న పారా మెడికల్ స్టాఫ్ నుంచి వివరాలు సేకరించారు. మృతురాలి కేస్ షీట్, బిడ్డ ఆరోగ్యం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అందరి నుంచి వివరాలు తీసుకున్నామని, వీటిని క్రోడీకరించి నివేదిక రూపంలో కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. అదే విధంగా జూలై నెలలో ఇక్కడ డెలివరీ నిమిత్తం చేరగా కడుపులోనే బిడ్డ చనిపోయిందని విరవకు చెందిన దంపతులు తమకు తెలియజేశారని చెప్పారు. దీనిపై పాడా కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించినట్టు తెలిపారు.

పోలవరం భూముల్లో సాగును అడ్డుకున్న ఆదివాసీలు


ఆదివాసీలతో మాట్లాడుతున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

- భూములపై కలెక్టర్, సబ్ కలెక్టర్ ఉత్తర్వులు అమలు చేయాలి
- లేకుంటే బైండోవర్ కేసులు: అధికారులు

ఎటపాక,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం నందిగామ, ముర్మూరు గ్రామాల్లో పోలవరం పరిహారం పొందిన భూముల్లో వ్యవసాయ పనులు చేస్తున్న పూర్వ యజమానులు గురువారం కొందరు ఆదివాసీలు అడ్డుకున్నారు. నందిగామ, ముర్మూరు గ్రామాల్లో పోలవరం ప్రాజెక్టు కోసం భూసేకరణలో భాగంగా సేకరించి, పరిహారం పొందిన భూముల్లో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మూడు నెలల క్రితం ఆదివాసీలు జెండాలు పాతడంతో వివాదం తలెత్తింది.దీనిపై భూముల పూర్వ యజమానులు కలెక్టర్‌కు, సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించి భూసేకరణ ప్రక్రియ, పునరావాస ప్యాకేజీ పూర్తయ్యేవరకు పూర్వ యజమానుల ఆధీనంలో ఆ భూములు ఉంటాయని, ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ శుభం నోక్వాల్ గత నెల 30న ఉత్తర్వుల జారీ చేశారు. ఈ క్రమంలో పూర్వ యజమానులు ఈ రెండు గ్రామాల్లోని భూముల్లో వ్యవసాయ పనులు మొదలు పెట్టగా ఆదివాసీలు అడ్డుకున్నారు. దీంతో తహశీల్దార్ కారం సుబ్బారావు, సీఐ కన్నపరాజు, ఎస్ఐ అప్పలరాజు అక్కడి వెళ్లారు. ఈ భూములపై కలెక్టర్ దినేష్‌కుమార్, సబ్‌కలెక్టర్ శుభం నోక్వాల్ స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నాయని, ఎవరైనా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పూర్వ యజమానులు సాగు చేయకుండా భూములను కౌలు ఇస్తే వారిపై కూడా ఎల్టీఆర్ కేసులు నమోదు చేస్తామని తహశీల్దార్ హెచ్చరించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి


రావులపాలెంలో బస్సు ఢీకొని మృతిచెందిన కోటమ్మ

రావులపాలెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన అడపాల కోటమ్మ(61) వ్యక్తిగత పనులపై రావులపాలెం వచ్చి పని ముగించుకుని స్వగ్రామం వెళ్లేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు నడుచుకుంటూ వెళ్తోంది. ఆ సమయంలో భీమవరం డిపోకు చెందిన బస్సు కోటమ్మను బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాల పాలైన ఆమెను 108 అంబులెన్స్ కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలు మనవుడు ఉండవల్లి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చంటి తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి


మృతుడు రేగటి దేవుడు

మరొకరికి గాయాలు

కోటనందూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండలం కేవో అగ్రహారం శివారులో గురువారం బైక్ అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసల వివరాల ప్రకారం.. తుని మండలం ఎన్ఎస్ వెంకట నగరం గ్రామానికి చెందిన రేగటి దేవుడు(33), అతడి చిన్నాన్న యేందుకంద అప్పారావు కలిసి బైక్‌పై కోటనందూరు వెళ్లి తిరిగి వస్తుండగా కేవో అగ్రహారం శివారులో బైక్ అదుపు తప్పింది. దీంతో ఇద్దరికీ బలమైన గాయాలు కావడంతో 108 వాహనంలో తుని ఏరియా అసుపత్రికి తరలించారు. అప్పటికే రేగటి దేవుడు మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. అప్పారావుకు చికిత్స పొందుతున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టానికి తరలించామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

గొల్లప్రోలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సామర్లకోట మండలం గొంచాల గ్రామానికి చెందిన భార్యాభర్తలు గొల్లప్రోలు మండలం చేబ్రోలు వచ్చారు. అక్కడ నుంచి గురువారం సాయంత్రం తిరిగి మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా అకస్మాత్తుగా వర్షం రావడంతో తడిచిపోకుండా ఉండేందుకు గానూ 216వ జాతీయ రహదారిపై చెందుర్తి సెంటర్ వద్ద ఉన్న దుర్గాదేవి గుడి వద్దకు మలుపు తిరిగారు. అదే సమయంలో కాకినాడ నుంచి విశాఖ వెళ్లే కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎటపాక, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎటపాక మండలం, రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన రాజుపేట గ్రామశివారు ప్రాంతంలో అక్రమంగా ఇసుక నిల్వలు ఉంచి గుట్టుచప్పుడు కాకుండా తెలంగాణలోని భద్రాచలం పట్టణానికి రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం తెల్లవారుజామున ఎస్ఐ జి.అప్పలరాజు పట్టుకున్నారు. గోళ్లగట్టు రోడ్‌లో ఓ ఇసుక ట్రాక్టర్‌ను, రాజుపేట నుంచి భద్రాచలం వెళ్తున్న మరో ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. కాగా రాజుపేట వద్ద రెండు చోట్ల అక్రమ ఇసుక నిల్వలు గుర్తించినా రెవెన్యూ అధికారులు సీజ్ చేయకపోవడం గమనార్హం. అయితే పట్టుబడిన రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ఘనంగా వైట్ కోట్ సెర్మనీ


రంగరాయలో వైద్య విద్యార్థికి వైట్ కోట్ తొడుగుతున్న డాక్టర్ విష్ణువర్ధన్

జీజీహెచ్(కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో వైట్ కోట్ సెర్మనీ గురువారం ఘనంగా జరిగింది. మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులకు ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ వైట్ కోట్ తొడిగి వైద్యుడిగా నిర్వర్తించాల్సిన ధర్మాన్ని, వ్యక్తులతో మెలగాల్సిన విధానాన్ని, బాధ్యతలను వివరించారు.నిష్పక్షపాత విధి నిర్వహణకు తెల్ల కోటు ప్రతీక అన్నారు. వైద్య విద్యార్థులు తెల్లకోటు వేసుకున్నప్పటి నుంచీ పరిపూర్ణమైన వైద్యుడిగా పరిపక్వతతో వ్యవహరించాలని సూచించారు.కార్యక్రమంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విజయశేఖర్, డాక్టర్ శశి, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్‌శ్రీనివాసన్, డాక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భారత్ బంద్

- మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట లేఖ
- అప్రమత్తమైన పోలీసులు


చింతూరులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

చింతూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మావోయిస్టులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ నేడు భారత్ బంద్‌కు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది.ఆ మేరకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్‌పేరిట లేఖ విడుదలైంది. దీంతో సరిహద్దు పోలీసులు అప్రమత్తమయ్యారు. మన రాష్ట్రంతోపాటు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చింతూరు భద్రాచలం నడుమ జాతీయ రహదారి 30పై గురువారం రాత్రి రాకపోకలను నిలువరించారు. భద్రాచలం వైపు వెళ్లే ప్రైవేటు వాహనాలను కూనవరం మీదుగా మళ్లించారు. మరోవైపు చింతూరు మీదుగా రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఎటపాక, చింతూరు, కూనవరం మండలాల మీదుగా మన రాష్ట్రంలోని విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడలతో పాటు తెలంగాణ, ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్‌ల వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను గురు, శుక్రవారాల్లో సాయంత్రం దాటాక నిలిపివేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. జాతీయ రహదార్ల అభివృద్ధి పనులకు వినియోగించే వాహనాలను బంద్ ప్రభావం ముగిసేంత వరకు సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాల్సిందిగా పోలీసులు సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. అనుమానిత ప్రదేశాల్లో నిఘా పెంచామన్నారు.

కాకినాడ

27న జాబ్‌మేళా

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రైవేట్ కంపెనీల్లో పనిచేసేందుకు కాకినాడ జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తి గల పురుషులు, మహిళలు తమ సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 86398 46568 నెంబరులో సంప్రదించాలని కోరారు.





← పిఠాపురం, సామర్లకోట, కొత్తపల్లిలో ఏకధాటిగా కురుస్తున్న వర్షం →

కుండపోత

పిఠాపురం, సామర్లకోట, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో భారీ వర్షం

పిఠాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం రాత్రి వరకు పలుమార్లు కుండపోతగా వర్షం కురిసింది. ఎక్కడిక్కడ డ్రైన్లు పొంగిపొర్లి రోడ్లపై నీరు ప్రవహించింది. రహదారులు జలాశయాలను తలపించాయి. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. తహసీల్దారు కార్యాలయం, ప్రభుత్వాసుపత్రి, ఫైర్ స్టేషన్ సెంటర్లు, అంబేడ్కర్ సెంటర్, పాత బస్టాండు, సినిమా సెంటర్, ఉప్పాడ సెంటర్, మార్కెట్, చర్చి సెంటర్, తారకరామనగర్, ఆర్టీసీ కాంప్లెక్సు, విద్యుత్‌నగర్, సీతయ్యగారితోట తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోయి ప్రజలు ఇక్కట్లు పడ్డారు. జీవన్‌నగర్‌లో ఇళ్ల వద్దకు నీరు చేరింది.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. పలుచోట్ల డ్రైన్లు పొంగిపొర్లి రోడ్లపైకి నీరు చేరింది.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపిలేని వర్షాలతో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. సామర్లకోట పట్టణం, మండలంలో ప్రధాన చెరువులు జలకళ సంతరించుకున్నాయి. సామర్లకోట పట్టణంలోని భాస్కర్ నగర్, సాయినగర్ తదితర ప్రాంతాల్లో వర్షం నీరు ఇళ్లల్లోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వీకే రాయపురం, బోయినపూడి, మాధవపట్నం, సత్యవరపుపేటల్లో డ్రైన్లు పొంగి ప్రవహించడంతో వరి పొలాలు ముంపులో చిక్కుకున్నాయి. ప్రస్తుతం వరి పొలాలు గింజ పాలుపోసుకునే దశలోను, పూత దశలోను ఉండడంతో పంట నష్టపోయే ప్రమాదం ఉందని కాకినాడ ఏడీఏ దుర్గాలక్ష్మి వెల్లడించారు. పెదబ్రహ్మదేవం, జి.మేడపాడు, గోలివారి కొత్తూరు, వేట్లపాలెం గ్రామాల్లో ముందుగా పక్వ దశకు చేరిన పంట కోతలను కొద్ది రోజుల పాటు నిలిపివేయాలని ఆమె రైతులకు సూచించారు. మండలంలో గురువారం ఉదయం నాటికి 41.4 మి.మీ. వర్షపాతం నమోదైందని మండల గణాంక అధికారి ప్రసాద్ తెలిపారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కుండపోతగా కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో లోతట్టు కాలనీలు మునిగాయి. సాయంత్రం కాస్త తగ్గడంతో ప్రజలు బయటకు వచ్చి నిత్యావసరాలను తెచ్చుకున్నారు. సార్వా చేలన్నీ ఈనిక దశలో ఉండడంతో పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

12 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలి

భారీ వర్షాల నేపథ్యంలో తక్షణ చర్యలు చేపట్టాలి: అధికారులకు అదనపు కమిషనరు సుధాకర్ ఆదేశం

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తుఫాను, భారీ వర్షాల నేపథ్యంలో కార్పొరేషన్ పరిధిలో 12 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు తక్షణ చర్యలు చేపట్టాలని అదనపు కమిషనరు కేటీ సుధాకర్ అధికారులను ఆదేశించారు. నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గురువారం సాయంత్రం ఆయన టెలి కాన్ఫరెన్స్ ద్వారా వివిధ విభాగాల అధికారులతో మాట్లాడారు. ప్రధాన డ్రైన్లు, కాలువలను పరిశీలించి నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. నీరు నిలిచే ప్రాంతాల్లో మోటార్లు, ఎక్స్‌కవేటర్లు సిద్ధంగా ఉంచి నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. భారీ గాలులతో చెట్లు పడిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, చెట్ల కొమ్మలను కత్తిరించడానికి అవసరమైన పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఉద్యాన విభాగానికి సూచించారు. నీటి సరఫరాలో అంతరాయం రాకుండా జనరేటర్లు, అలమ్, క్లోరిన్ సరఫరా తగినంతగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని వాటర్ సప్లై విభాగానికి ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదకరంగా ఉన్న బోర్డులు, బ్యానర్లు, కేబుల్ వైర్లు తొలగించాలని, శిథిలావస్థలో వున్న భవనాల్లో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించాలని పట్టణ ప్రణాళిక విభాగాన్ని ఆదేశించారు. ఆరోగ్య/శానిటేషన్ విభాగం రాత్రి సమయంలో అత్యవసర సేవల కోసం సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని, బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్, సున్నం తగినంత నిల్వలో ఉంచాలని సూచించారు. సర్కిళ్ల వారీగా వర్షం పరిస్థితులను పర్యవేక్షించి, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఆఫీసర్లను సుధాకర్ ఆదేశించారు.

కల్తీ మద్యం పేరు వినిపిస్తే కఠిన చర్యలు: ఎమ్మెల్యే చినరాజప్ప



మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం అన్నమాటే వినిపించకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని పలు మద్యం దుకాణాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విక్రయాలు జరుగుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కల్తీ మద్యానికి పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయడానికి రూపొందించిన సురక్ష మొబైల్ యాప్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఎక్సైజ్ అధికారులు, దుకాణ దారులపై ఉందన్నారు. ఇరిగేషన్ కార్యాలయ స్థలంలో వేద పాఠశాల భవన నిర్మాణంపై చర్చించారు. ఆర్డీవో శ్రీరమణి, తహసీల్దారు వెంకటలక్ష్మి, ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యాన్ని అరికట్టేందుకే 'సురక్ష' యాప్

టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసబాబా



కాకినాడ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం సురక్ష యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా పేర్కొన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యాన్ని కొనుగోలు చేసే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి నకిలీదా, నాణ్యమైనదా తెలుసుకోవాలన్నారు. ఈ యాప్ వినియోగంపై ప్రతి గ్రామంలోను ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఈపీ నాయుడు, పెంకే సత్యనారాయణ పాల్గొన్నారు.



మకరతోరణం బహూకరిస్తున్న శ్రీనివాసరావు-ఉమాబంగారు లక్ష్మి దంపతులు

ఇత్తడి మకరతోరణాలు బహూకరణ



పిఠాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చింతా వారి వీధిలో ఉన్న మహాలక్ష్మి గణపతి సహిత సీతారామాంజనేయస్వామి ఆలయానికి దాతలు మకరతోరణాలు బహూకరించారు. మహాలక్ష్మి, లక్ష్మీగణపతి, దాసాంజనేయస్వామి వార్లకు మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్ విశ్రాంత ఉద్యోగి పోలేపల్లి శ్రీనివాసరావు-ఉమాబంగారులక్ష్మి దంపతులు ఇత్తడి మకరతోరణాలు తయారు చేయించి గురువారం ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. వీటిని స్వామి. అమ్మవార్లకు అలంకరించి ఆలయ అర్చకుడు పి.కాశీవిశ్వనాథశాస్త్రి ఆధ్వర్యంలో పూజలు జరిపారు. దాత దంపతులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. పిఠాపురం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొత్తపల్లి పద్మబుజ్జి, మాజీ కౌన్సిలర్ కోరిమిల్లి విజయలక్ష్మి, టేకు శంకరరావు, టి.విశ్వనాథం, రవికుమార్, వీరభద్రరావు, డేగల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అమీనబాద్‌లో పబ్లిక్ కుళాయిలో బురద నీరు



కొత్తపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత గ్రామమైన అమీనబాద్‌లో గురువారం పంచాయతీ కుళాయిల నుంచి బురద నీరు వచ్చింది. రోజూ మంచినీరు ఎప్పుడు ఇస్తారో తెలియదు. కుళాయిల వద్దకు ఆతృతగా వెళ్తే బురద నీరు వస్తోందంటూ మంచినీటి పథకం నిర్వాహకుల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు చేపట్టి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని మత్స్యకారుడు ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

సహచర విద్యార్థులతో సుహృద్భావంతో మెలగాలి

కాకినాడ టూటౌన్ సీఐ అప్పలనాయుడు



సీఐ అప్పలనాయుడును సత్కరిస్తున్న ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ బృందం

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్క విద్యార్థీ అవగాహన కలిగి ఎదుటి విద్యార్థితో సుహృద్భావంతో మెలగాలని, తద్వారా ప్రశాంతమైన వాతావరణం నెలకొంటుందని కాకినాడ టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు అన్నారు. యాంటీ ర్యాగింగ్ డే సందర్భంగా కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ అధ్యక్షతన ఫిజియాలజీ గ్యాలరీలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సీఐ అప్పలనాయుడు మాట్లాడుతూ ఆర్ఎంసీలో ప్రస్తుతం ర్యాగింగ్‌కు తావు లేకుండా విద్యార్థులంతా సమాజంపై అవగాహన, ఎదుట విద్యార్థిపట్ల సోదర భావం పెరగడం ద్వారా కేవలం విద్యపై మాత్రమే దృష్టి సారించగలుగుతున్నారన్నారు. ఇంకా అక్కడక్కడా చెదురుమదురు సంఘటనలు చోటుచేసుకుంటున్నా పోలీస్ చర్యలతో అంతా సద్దుమణిగి ప్రశాంత వాతావరణం నెలకొంటోందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ కళాశాలలో చాలాకాలంగా ర్యాగింగ్ ఛాయలు లేవన్నారు. ర్యాగింగ్ నిరోధానికి కఠినమైన చర్యలు తీసుకున్నామన్నారు. నిరంతర పర్యవేక్షణ, మెంటర్ వ్యవస్థలు, ర్యాగింగ్ ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక యంత్రాంగం పనిచేస్తోందన్నారు. జూనియర్లకు మార్గదర్శకంగా నిలిచి వారు సత్ప్రవర్తనతో మంచి విద్యనభ్యసించేలా సీనియర్లు నడిపించాలన్నారు. కళాశాలలో స్నేహపూర్వక వాతావరణం సృష్టించి స్నేహం, గౌరవంతో పరస్పర అభివృద్ధికి నిదర్శనంగా నిలవాలన్నారు. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ విజయశేఖర్, డాక్టర్ శశి, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్‌శ్రీనివాసన్, డాక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది, మహిళా భక్తులు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ హుండీల ఆదాయం రూ.1.73 లక్షలు

కాకినాడ రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెంలోని శ్రీమందేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలోని హుండీలను దేవదాయ శాఖ తనిఖీదారు వి.ఫణీంద్ర కుమార్, కాజులూరు, కైకవోలు గ్రూపు దేవస్థానాల ఈవోలు డి.శ్రీనివాసరావు, కె.వేణుగోపాల్ పర్యవేక్షణలో గురువారం తెరిచి లెక్కించారు. 120 రోజులకు రూ.1,73,228 వచ్చిందని ఈవో జోగా సత్యనారాయణ తెలిపారు. లెక్కింపులో అర్చకులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సెలట్‌రాజు, ఎంఈవోలు

'ఆధార్ బయోమెట్రిక్స్ అప్‌డేట్ చేయించుకోవాలి'

గొల్లప్రోలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ ఆధార్ బయోమెట్రిక్స్‌ను అప్‌డేట్ చేయించుకోవాలని గొల్లప్రోలు ఎంపీడీవో సెలట్‌రాజు, ఎంఈవోలు వెన్నా శ్రీనివాస్, వెంకటశివప్రసాద్ సూచించారు. పట్టణంలోని మాధురి విద్యాలయలో ఏర్పాటుచేసిన ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని వారు గురువారం పరిశీలించారు. 5 నుంచి 15 సంవత్సరాలు ఉన్న విద్యార్థులందరికీ ఇది తప్పనిసరి అని చెప్పారు.

పంట కాలువ గట్లపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు'

కొత్తపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): 'పంట కాల్వల పరిరక్షణ మనందరి బాధ్యత, కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త వేయకుండా అరికట్టడంలో ప్రజలు, రైతులు భాగస్వాములు కావాలి' అని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో మండలంలోని ఎండపల్లి, కొత్తపల్లి పీబీసీ కాలువ గట్లపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్టు తూర్పు డెల్టా ప్రాజెక్టు చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ చెప్పారు.

డ్రైనేజీల్లో పూడిక తొలగింపు



మారుతీనగర్‌లో డ్రైన్‌లో పూడికతీత పనులు చేయిస్తున్న సర్పంచ్ సత్యనారాయణ

సర్పవరం జంక్షన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ఏలేరు వరద నీరు ముందుకెళ్లడంలో అవరోధాలు ఏర్పడ్డాయి. కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం పంచాయతీ పరిధిలో ని పేట కాలువ గుండా రమణయ్యపేట నుంచి ఉప్పుటేరులోకి వెళ్లే ప్రధాన డ్రైన్ ఆక్రమణకు గురైంది. అది కుచించుకుపోవడం, కాలువలో పూడికతీత పెరిగిపోవడంతో వరద నీరు ముందుకెళ్లేదారి లేక పంచాయతీ పరిధిలోని రేపాక, గోకుల్ గార్డెన్స్, మారుతీనగర్, పేటకాలువ, అవంతినగర్ కాలనీలు ముంపునకు గురయ్యాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గమనించిన సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ తన సొంత నిధులతో మారుతీనగర్, పేటకాలువ ప్రాంతాల్లోని డ్రైన్లలో పేరుకుపోయిన తూటుకాడ, గుర్రపుడెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్స్‌కవేటర్లతో తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. డ్రైన్లపై నిర్మించిన అక్రమ కట్టడాల తొలగింపునకు డ్రైనేజీ అధికారులు చర్యలు తీసుకోవడంతో పాటు డ్రైన్ల నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌కు సర్పంచ్ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.

'ఉద్యాన రైతులు ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ జిల్లా అధికారి సిరిల్

పెద్దాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలు సాగుచేసే రైతులు ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి సిరిల్ పేర్కొన్నారు. మండలంలోని కట్టమూరులో మండల ఉద్యాన శాఖాధికారి కటకం సత్యశైలజ ఆధ్వర్యంలో యాజమాన్య పద్ధతులపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించడంతో పాటు ఆదాయం పొందవచ్చని సూచించారు. తీగజాతి కూరగాయలు సాగు చేసే రైతులకు శాశ్వత పందిర్లు వేసుకోవడానికి ఎకరానికి రూ.లక్ష రాయితీని ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఆయిల్‌పామ్ తోటల సాగుకు నూరు శాతం, ఎరువులు, పురుగు మందులకు, బిందు, తుంపర్ల సేద్యానికి సైతం రాయితీ ఇస్తున్నట్టు చెప్పారు. అనంతరం పామాయిల్, కర్రపెండలం సాగులో తీసుకోవాల్సిన మెళకువలను వివరించారు. ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ జానకి, వీహెచ్‌ఏ అపర్ణ, వీఏఏ రామ్‌ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

కనీస వేతనం పొందేలా పనుల గుర్తింపు

కొత్తపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసే శ్రామికులకు కనీస వేతనం చెల్లించే విధంగా కొత్త పనులపై అవగాహన కల్పిస్తున్నామని ఏపీవో గొన్నాబత్తుల కొండలరావు తెలిపారు. 2026-27 సంవత్సరంలో చేపట్టే కొత్త పనుల గుర్తింపు కోసం కొత్తపల్లిలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామసభలో గుర్తించిన పనుల ద్వారా శ్రామికులకు 100 రోజులు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఏపీవో కొండలరావు వివరించారు. ఎంపీడీవో లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, మహిళా సమాఖ్య ఏపీవో మల్లేశ్వరరావు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

చేబ్రోలు పీహెచ్‌సీ తనిఖీ



గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు పీహెచ్‌సీని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కేవీ సుబ్బరాజు గురువారం తనిఖీ చేశారు. ఇక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. చేబ్రోలుకి చెందిన దొండపాటి శ్రీదుర్గ మాతృ మరణం రిజిస్ట్రేషన్‌పై సూచనలిచ్చారు. ఆయన వెంట డీపీహెచ్ఎన్ నీలవేణి, ఎంపీహెచ్ఈవో కిషోర్, రామ్మోహన్, సూపర్‌వైజరు నార్ని గంగాధర్ ఉన్నారు.



మంత్రి రామనారాయణరెడ్డితో ఎంపీ సతీష్

దేవదాయ శాఖ మంత్రిని కలిసిన ఎంపీ సతీష్‌బాబు

కాకినాడ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని విజయవాడలోని ఆయన నివాసంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధి, సనాతన సంప్రదాయాల పరిరక్షణ, భక్తులకు మెరుగైన సౌకర్యాలు తదితర అంశాలపై చర్చించారు. ప్రాంతీయ దేవాలయాల అభివృద్ధికి నిధుల కేటాయింపు, యాత్రికులకు మౌలిక సదుపాయాల కల్పన విషయాలను ఎంపీ సతీష్‌బాబు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రతిపాదనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని ఎంపీ క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.



కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచిన దుర్గాడ ఉన్నత పాఠశాల విద్యార్థినులు

చేబ్రోలులో ముగిసిన క్రీడా పోటీలు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజులు జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు గురువారం సాయంత్రం ముగిశాయి. అండర్ 14, 17 బాలికల విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఎంఈవోలు వెన్నా శ్రీనివాస్, వెంకటశివప్రసాద్, హెచ్ఎం సీహెచ్ ప్రకాష్, పీడీ తోట వెంకటరాజు తదితరులు పర్యవేక్షించారు.

ఆకట్టుకుంటున్న మట్టి శివలింగం



పెద్దాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా సిరివాడ గ్రామానికి చెందిన కోలా దుర్గ, పల్లా మురళి సుమారు ఎనిమిది అడుగుల పుట్టమన్నుతో శివలింగాన్ని తయారు చేశారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి దీనిని దర్శించుకుంటున్నారు.

ప్రకటన

స్కాట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి, తుని

(స్థాపించబడినది 2 మార్చి, 1879 - CBCNC అనుబంధ సంస్థ)

సభ్యులకు తెలియజేయబడునది ఏమనగా, తుని స్కాట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి యొక్క వార్షిక జనరల్ బాడీ సభ 25 అక్టోబర్ 2025న నిర్వహించుటకు ప్రకటించబడినది. కానీ తుని పట్టణంలోని కొండవారిపేట ప్రాంతంలో చోటుచేసుకున్న దురదృష్టకరమైన సంఘటన కారణంగా, జనరల్ బాడీ సభను వాయిదా వేయబడినది.

జనరల్ బాడీ సమావేశం కొత్త తేదీ చర్చి ప్రకటన ద్వారా ప్రకటించబడును.

బి.జె.వి. ప్రసాద్
అధ్యక్షుడు & నామినేషన్ కమిటీ కన్వీనర్
స్కాట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి, తుని

షాపులు టెండర్-కమ్-బహిరంగ వేలం ప్రకటన

కాకినాడ జిల్లా, కాకినాడ, దేవాలయం వీధిలో వేంచేసియున్న శ్రీ భీమేశ్వర స్వామివారి దేవస్థానమునకు డోర్ నెం.36-4-26లో గల షాపింగ్ కాంప్లెక్స్‌లో 9'×18' కొలతలు గల షాపు నెం.3 మరియు షాపు నెం.4ను 3 సం॥లు కాలమునకు వ్యాపారము చేసుకొను లైసెన్సు హక్కునకు ది.07-11-2025 ఉ.10.00 గం॥లకు దేవస్థానం వద్ద దేవదాయశాఖ అధికారుల సమక్షములో టెండర్-కమ్-బహిరంగ వేలం సదరు దేవాలయం వద్ద జరుగును.

షెడ్యూలు

క్ర. నెం	షాపు గల గ్రామం మండలం & జిల్లా	డోరు.నెం.	షాపు కొలతలు	ధరావత్తు	కాలపరిమితి	బహిరంగ వేలంపాట జరుపబడు ప్రదేశం
1	కాకినాడ దేవాలయం వీధి, షాపునెం.03	36-4-26	9'×18' కొలతలు	25,000/-	షాపు అప్పగించిన తేది నుండి 3 సం॥లు	శ్రీభీమేశ్వరస్వామివారి దేవస్థానంవద్ద 7.11.2025 ఉ.10.00 గం॥లకు
1	కాకినాడ దేవాలయం వీధి, షాపునెం.04	36-4-26	9'×18' కొలతలు	25,000/-	షాపు అప్పగించిన తేది నుండి 3 సం॥లు	శ్రీభీమేశ్వరస్వామివారి దేవస్థానంవద్ద 7.11.2025 ఉ.10.00 గం॥లకు

పాట ముఖ్య షరతులు: 1. పాటలో పాల్గొనువారు వారి యొక్క ఏదైనా ఫోటో గుర్తింపు కార్డు, సాల్వెన్సీ సర్టిఫికెట్లు సమర్పించి పాటలో పాల్గొనవలెను. 2. హెచ్చు పాటదారు పాట అనంతరం ఒక సం॥ము పాట సొమ్ము డిపాజిట్టుగా కట్టి షాపులో ప్రవేశించు నిర్ణయం, సదరు సొమ్ము చివరి నెలలో ముదరా చూసుకొను నిర్ణయం. ఈ డిపాజిట్టు సొమ్ముకి ఏ విధమైన వడ్డీ ఇవ్వబడదు. 3. దేవస్థానమునకు బకాయిలు ఉన్నవారు, ఇతర లావాదేవిలు ఉన్నవారు పాటలో పాల్గొనరాదు. ఈ పాటలో హిందువులు మాత్రమే పాల్గొనుటకు అర్హులు. 4. మిగిలిన పాట షరతులు కార్యాలయం పనివేయు వేళలలో తెలుసుకొనవచ్చును.

కాకినాడ
ది.22.10.205

చైర్మన్
ధర్మకర్తల మండలి

ఐఅ: కార్యనిర్వహణాధికారి
సెల్:9989802349

నేటి నుంచి గౌరీదేవి సంబరాలు

గండేపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లి గ్రామంలో కోరిన కోరికలు తీర్చే సంతాన గౌరీగా పేరొందిన గౌరీదేవి సంబరాలు శుక్రవారం నుంచి ఘనంగా ప్రారంభంగా కానున్నాయిని కమిటీ సభ్యులు తెలిపారు. వారం రోజులపాటు జరిగే భజనతో పాటు, పలు సాంస్కృతి కార్యక్రమాలు జరుగుతాయని వారు తెలిపారు. ఆయా కార్యక్రమాలను ప్రజలు, భక్తులు విజయవంతం చేయాలని వారు కోరారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

నేడు మావోయిస్టుల బంద్

● వాహనాల తనిఖీ



మోతుగూడెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): 24న మావోయిస్టులు బంద్ సందర్భంగా వాహనాల తనిఖీ చేపట్టారు. చింతూరు మం డలం మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలలో మోతుగూడెం ఎస్‌ఐ ఎస్‌కే సాదిక్, తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీలు చేశారు. వాహనాలు నిలిపి రికార్డులను పరిశీలించారు. వాహనాలలో ప్రయాణికులు లగేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు ఈ తనిఖీల్లో సివిల్ పోలీసులు, సీఆర్పీఎఫ్/42 బెటాలియన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

అడ్డతీగల (ఆంధ్రజ్యోతి): శుక్రవారం మావోయిస్టుల భారత్ బంద్ పిలుపు మేరకు అడ్డతీగల మండల వేటమామిడి జంక్షన్‌లో అడ్డతీగల సీఐ బి.నరసింహమూర్తి, ఎస్‌ఐ వినోద్ ఆధ్వ ర్యంలో ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. వాహనాదారులు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళుతున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు.



అంగన్వాడి కేంద్రంలో రైస్ తనిఖీ చేస్తున్న దృశ్యం

ప్రత్యేకాధికారి తనిఖీలు

వై.రామవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):మండల ప్రత్యేకాధికారి, రంపచోడవరం పీహెచ్‌వో దయానంద గురువారం ఎంపీడీవో బాపన్నదొరతో కలిసి మండలంలో పలుచోట్ల తనిఖీలు చేశారు. దాలిపాడు ఆశ్రమ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీచేసి డొక్కా సీతమ్మ భోజన పథకం విద్యార్థుల ఆరోగ్యస్థితిగతులను పరిశీలించారు. చవిటి దిబ్బలు, దాలిపాడు గ్రామాలలో సచివాలయాలను సందర్శించారు.

పర్యాటక ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేపట్టాలి



ఐ.పోలవరం పర్యాటక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాలలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఐ.పోలవరం పర్యాటక ప్రాంతాన్ని పరిశీలించారు. కార్తీకమాసంలో మైదాన ప్రాంతాల నుంచి ఏజెన్సీ అందాలను తిలకించేందుకు పర్యాటకులు తాకిడి పెరుగుతుందని వాగులవద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని సూచించారు. పర్యాటకులు ఏర్పాటుచేసిన కుండీలలో చెత్తను వేసేలా అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఏపీవో జి.కిషోర్ ఉన్నారు.

జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

రంపచోడవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30న మారేడుమిల్లిలో జరిపే గిరిజన సమాఖ్య జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొట్టిక సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన చట్టాలు అమలు చేయకుండా అన్యాయం చేస్తున్నారని, జీవో నెం.3 రద్దుతో నిరుద్యోగ యువత కూలీ పనులు చేసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య డివిజన్ నాయకురాలు గోవు దుర్గా, డివిజన్ కార్యదర్శి కుమార్, యువజన సంఘం నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, గిరిజన సంఘం నాయకుడు చంద్రరావు, కార్మిక సంఘం నాయకుడు సుబ్బారావు, బాలు పాల్గొన్నారు.

బాలుడి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

రంపచోడవరం, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం నాగంపల్లి సీఆర్‌బీ క్రాషర్‌లో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన గిరిజన బాలుడు గుమా సుండి(17) మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి గురువారం ప్రకటనలో డిమాండ్ చేశారు. తక్షణమే బాలుడి కుటుంబానికి రూ.50లక్షలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఘటనపై లేబర్ కమిషనర్, జిల్లా కలెక్టర్, మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన

మోతుగూడెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఏపీ జెన్‌కో ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో లోయర్ సీలేరు కాంప్లెక్స్ ఉద్యోగులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. మోతుగూడెం, డొంకరాయి సీలేరులో 23,24 తేదీల్లో అవగాహన కార్యక్రమం ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు మీడియా ఛానల్‌లో టెక్ ప్రెజెంటర్‌గా, తెలంగాణాలో సీఐడీ డిపార్టుమెంట్‌కు సలహాదారులు నల్లమోతు శ్రీధర్ సైబర్ సెక్యూరిటీపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లోయర్ సీలేరు చీఫ్ ఇంజనీర్ రాజారావు, ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ చీఫ్ ఇంజనీర్ శ్రీధర్, ఎస్‌ఈవో అండ్‌ఎం చిన కామేశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై రివ్యూ మీటింగ్

అడ్డతీగల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో గురువారం ఉపాధి పథకం పనులపై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, జేఈను ఏపీవో సమక్షంలో ఈకేవైసీ, జియో టాగింగ్, కంపోస్టు పిట్స్ అంశాలపై చర్చించారు. సమావేశంలో ఏపీవో రావు యాదవ్, సిబ్బంది ఉన్నారు.

పంచాయతీ ఏర్పాటుపై అభిప్రాయ సేకరణ

రాజవొమ్మంగి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారేడుబాక పంచాయతీలో ఉన్న ఉర్లాకులపాడు గ్రామాన్ని పంచాయతిగా ఏర్పాటుపై అధికారులు గురువారం ప్రజల నుంచి అభిప్రాయా లు సేకరించారు. ప్రస్తుతం మారేడుబాక పంచాయతీలో ఉన్న ఉర్లాకులపాడు గ్రామం నుంచి పంచాయతీ కార్యాలయానికి వెళ్లాలంటే సుమారు 30కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని, చుట్టు పక్కల గ్రామాలతో ఉర్లాకులపాడునే నూతన పంచాయతీగా ఏర్పా టు చేయలంటూ ఇప్పటికే ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్‌కు గ్రామస్థు లు వినతిపత్రాలు అందజేశారు. గురువారం ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్ ఆదేశాల మేరకు తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరేశ్వరావు ఉర్లాకులపాడు గ్రామంలో గ్రామసభ నిర్వహించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. జి.శరభవరం, కోసూరివారి వీధి, ఉర్లాకులపాడు గ్రామాలను కలిపి ఉర్లాకులపాడు పంచాయతీ చేయాలని విజ్ఞప్తి చేశారు. మారేడుబాక సర్పంచ్ ఆదిరాజు,మాజీ జడ్పీటీసీ కోసూరి బుజ్జి చిన్నాలమ్మ, మాజీ సొసైటి అధ్యక్షుడు గణజాల తాతరావు ఉన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

అడ్డతీగల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న 74 పంటకోత ప్రయోగాలపై గ్రామ వ్యవసాయాధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించామని మండల వ్యవసాయ అధికారి సీహెచ్ శివశ్రీనివాస్ తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో స్టాటిస్టికల్ ఆఫీసర్ సత్యనారాయణ పంటకోత ప్రయోగాలు ఏ విధంగా నిర్వహించాలో వివరించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు సావిత్రి మాట్లాడుతూ ప్రయోగాలను సక్రమంగా నిర్వహించాలని, దాని విశిష్టతను తెలియజేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

వీఆర్‌పురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) మండలంలోని రామవరం గ్రామంలో వరద బాధిత రైతులకు రేఖపల్లిలోని ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వి. గాంధీబాబు ఆధ్వర్యంలో నిత్యావసర కిట్లు ఎంపీపీ కారం లక్ష్మి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గోదావరి వరదల కారణంగా పంటలు నష్టపోయిన 200 మంది రైతులకు గురువారం రూ.1000 విలువ చేసే నిత్యావసర కిట్లు అందజేశారు.

క్రీడా స్థలం అభివృద్ధికి ఎమ్మెల్యే సొంత నిధులు అందజేత



ప్రిన్స్‌పాల్‌కు చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

రౌతులపూడి, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): ఎ.మల్లవరం గురుకుల పాఠశాలలో క్రీడా స్థలం అభివృద్ధికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సొంత నిధులను విరాళంగా ఇచ్చారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావుకు గురువారం పాఠశాల ఆవరణలో చెక్‌ను అందజేశారు. క్రీడా స్థలం అధ్వానంగా ఉండడంతో విద్యార్థులు ఆటలకు దూ రంగా ఉండకూడదనే ఉద్దేశంతో సొంత నిధులు అందజేసినట్టు తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి నిధుల మంజూరు కృషి చేయనున్నట్టు తెలిపారు. ముందుగా అంబేద్కర్‌కు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తమరాల సత్యనారా యణ, కత్తిపూడి సత్రం చైర్మన్ సోమరౌతు చంద్రమౌళి, ఎల్.రాము, సింహాద్రి పెదబాబు, మాజీ ఎంపీపీ ఐ. సూర్యభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు

ధర్మవరంలో వైభవంగా లక్ష బిల్వార్చన

ప్రత్తిపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం గ్రామంలో ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎం.మురళీకృష్ణంరాజు సామిల్లు వద్ద గురువారం నిర్వహించిన లక్ష బిల్వార్చన, అఖండ హారతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. క్షత్రియ రెస్టారెంట్ అధినేత బెందుకూరి రామస్వామి ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన దండపాణి గురుస్వామి, వేలు గురుస్వామి, రవి, చంటి గురుస్వాములు, ప్రదీప్ శర్మ పర్యవేక్షణలో హోమాలు, 108 కలశాలతో ప్రదక్షిణలు నిర్వహించారు. అయ్యప్పస్వామిని గ్రామంలో ఊరేగించి పడిపూజ నిర్వహించారు. అనంతరం అఖండ హారతి ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామపెద్దలతో పాటు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.



తేటగుంటలో యనమల సమక్షంలో టీడీపీలో చేరిన దృశ్యం

కష్టపడే వారికి పార్టీలో సముచిత స్థానం

తుని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పని చేసే వారికి టీడీపీలో సముచిత స్థానం ఉంటుందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. తొండంగి మండలం పెరుమాళ్ళపురం పంచాయతీ నుంచి ఆ మండల టీడీపీ అధ్యక్షుడు చొక్కా అప్పారావు, చొక్కా మహంకాళి, కొయ్యా మల్లేష్ ఆధ్వర్యంలో వైసీపీ నుంచి పెద్ద ఎత్తున టీడీపీలో చేరారు. తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో వారు టీడీపీలో చేరగా పార్టీ కండువాలు కప్పి ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, కొత్త, పాత వైషమ్యాలు పక్కన పెట్టి సమష్టిగా పని చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. రానున్న స్థానిక ఎన్నికల్లో నూరు శాతం విజయం సాధించేలా ముందుకు సాగాలన్నారు. టీడీపీలో చేరిన వారిలో చొక్కా కొండయ్య, గరికిన ఎల్లారావు, చొక్కా సత్తిబాబు, మేరుగు రమణ, పెరుమాళ్ళ కొండయ్య, చొక్కా విష్ణు, బొందు చిట్టిబాబు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు యనమల రాజేష్, కోడా వెంకటరమణ, చింతమనీడి అబ్బాయి తదితరులు ఉన్నారు.



తుని-నర్సీపట్నం రహదారిపై గొంపకొండ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

కుండపోతగా వర్షం

కోటనందూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో గురువారం కుండపోతగా వర్షం కురిసింది. దీంతో తుని-నర్సీపట్నం రహదారిపై గొంపకొండ వద్ద కొండపై నుంచి వచ్చేనీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. మండలంలోని ఆయా గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి పలు రోడ్లు ముంపుబారిన పడ్డాయి.

రహదారులు జలమయం

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా గురువారం కురిసిన వర్షానికి ఆయా రహదారులు జలమయమయ్యాయి. గత ప్రభుత్వం ఏఒక్క రోడ్డుకు డ్రైనేజీలు, మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆయా రోడ్లు పెద్ద పెద్ద గుంతలతో చెరువులను తలపిస్తున్నాయి. దీంతో వర్షపు నీరు పోయే మార్గం లేకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే రహదారులపై నిలిచిపోతోంది. నగర పంచాయతీ పరిధిలో షిర్డీనగర్, చైతన్యనగర్, లక్ష్మవరం కాలనీలలో సీసీ రోడ్లు అభివృద్ధి చేయాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో చినుకుపడితే బురద నీరు చేరడంతో ప్రజలకు, వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. మండలంలోని యర్రవరం, సిరిపురం, పేరవరం గ్రామాల్లో పంట పొలాలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతులు కనీస జాగ్రత్తలు తీసుకోవాలి

గండేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలు పడుతున్నందున రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని గండేపల్లి మండల వ్యవసాయ అధికారి లక్ష్మి సూచించారు. ఈనెల 27 వరకు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వరి పంట కోయకుండా నిలిపివేయాలన్నారు.



పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ

గండేపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మల్లేపల్లిలో బుధవారం అయ్యప్పస్వామి పడి పూజను నిర్వహించారు. మల్లేపల్లి గ్రామానికి చెందిన రాపర్తి సత్యనారాయణ అయ్యప్పస్వామి దీక్ష 18 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడి పూజను రాజమండ్రికి చెందిన గురుస్వామి ఆమంచి ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిపారు. కార్యక్రమంలో బొల్లంరెడ్డి రామకృష్ణ, అడబాల ఆంజనేయులు, కాపుగంటి బాబులు, గొల్లవిల్లి శ్రీను, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సత్యప్రభ పరామర్శలు

రౌతులపూడి, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురుని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ గురువారం పరామర్శించారు. రాజవరంలో గుండె ఆపరేషన్ చేయించుకున్న ఎంపీటీసీ సోమరౌతు నాని, ఇటీవల అనారోగ్యంతో ఎంపీపీ జి.రాజ్యలక్ష్మి తండ్రి మృతి చెందగా ఎంపీపీ కుటుంబాన్ని, రౌతులపూడిలో మాజీ సర్పంచ్ వాసిరెడ్డి దేవుళ్లు మృతి చెందగా వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

కూటమి ప్రభుత్వంలో కష్టపడిన వారికే పదవులు

రౌతులపూడి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో కష్టపడిన వారికే గుర్తింపు ఉంటుందని వక్తలన్నారు. దీనికి నిదర్శనంగా ఆత్మకమిటీలో రౌతులపూడికి చెందిన యాదగిరి వెంకటరమణ (శ్రీను)కు మెంబర్‌గా నియమించడమేనన్నారు. ఆయన్ను మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు నివాసంలో యువనేత ఇటంశెట్టి అశోక్‌తో కలిసి సన్మానించారు. బీజేపీకి రమణ చేసిన సేవలు, కూటమి ప్రభుత్వం అధికారంలో రావడానికి కృషిని కొనియాడారు.

ఆదిత్యలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభం

గండేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ (ఏఐ అండ్ ఎమ్ఎల్) విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభమైంది. దీనికి డాక్టర్ కరుణాకర్ పొదుగంటి, హెడ్ ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్ అండ్ కరికులం డిజైన్, బైట్ఎక్స్ఎల్ టెక్ఎడ్, హైదరాబాద్, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైస్ చాన్సలర్ డాక్టర్ ఎం.బి.శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఏ.రమేష్, అసోసియేట్ డీన్ ఎంవీ రాజేష్ తదితరులు హాజరయ్యారు.



రక్తదాన శిబిరం

గండేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి-సింగరంపాలెం వెళ్లే రహదారిలో ఉన్న వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ ఆవరణలో గురువారం రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ సెక్రటరీ వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ అధినేత మండవిల్లి వెంకన్నబాబు పుట్టినరోజు సందర్భంగా రాజమండ్రి రోటరీ ఐకాన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురు వర్కర్లు, అధినేత వెంకన్న బాబు, పలువురు ఆర్యవైస్ సభ్యులు సుమారు 50 మందికి పైగా రక్తదానం చేశారు. దీనికి కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల మోహన్ రావు హాజరై రక్తదానం చేసిన వారిని అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ గండేపల్లి గ్రామ అధ్యక్షులు బొల్లంరెడ్డి రామకృష్ణ, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

● ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి



పెద్దిపాలెం హైస్కూల్ వద్ద మాట్లాడుతున్న టీచర్ ఎమ్మెల్సీ గోపిమూర్తి

ప్రత్తిపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అప్‌గ్రేడ్ చేసిన పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి కోరారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని పలు పాఠశాలలను గురువారం ఆయన సందర్శించి పాఠశాల స్థితిగతులను పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గోపిమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయంలో నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా 80శాతం ప్రభుత్వ పాఠశాలలను పూర్తి చేశారని, మిగిలిన 20శాతం పనులను వెంటనే కూటమి ప్రభు త్వం పూర్తి చేయాలన్నారు. పీపీపీ విధానంపేరుతో ప్రైవేట్ వ్యక్తులకు ప్రైవేట్ మెడికల్ కళాశాలలు అప్పగించడంవల్ల పేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రత్తిపాడు, ధర్మవరం, ఒమ్మంగి, పెద్దిపాలెం, లంపకలోవ తదితర పాఠశాలలను ఎమ్మెల్సీ గోపి మూర్తి సందర్శించి ఆయా పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పెద్దిపాలెం, చినశంకర్లపూడి పాఠశాలలకు అదనపు తరగతి గదులు ఏర్పాటు చేయాలని, అలాగే ఇతర మౌలిక వసతులు కల్పించాలని ఉపాధ్యాయులు ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్షుడు కోడి శ్రీనివాసరావు, యూటీఎఫ్ నాయకులు దొడ్డి పట్ల రాజబాబు, రాపర్తి రామలింగేశ్వరరావు, జీవీఎస్ ప్రసాద బాబు, స్వామి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి ప్రత్తిపాడు ఎస్‌ఐ లక్ష్మీకాంతం చెప్పారు. మండలంలోని ధర్మవరంలో అద్దేపల్లి అచ్యుతరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సాయంత్రం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరిస్తా

కిర్లంపూడి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):ప్రజా సమస్యల పరిష్కార పర్యటనలో భాగంగా ఇండిపెండెంట్ అభ్యర్థి పాటంశెట్టి సూర్యచంద్ర కిర్లంపూడి మండలం శృంగరాయునిపాలెం ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు, ఆటస్థలం సమస్యలను పరిష్కరించాలని సూర్యచంద్ర దృష్టికి తీసుకువచ్చారు. వీటిని బాగుచేసి వెంటనే విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అలాగే ఉన్నత అధికారులు ట్విట్టర్, ఈమెయిల్ పీజీఆర్ఎస్, ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ల ద్వారా సమస్య తెలిసేలా చేసి పరిష్కారానికి ప్రభుత్వాన్ని ఒత్తిడి చేస్తామని పాటంశెట్టి సూర్యచంద్ర తెలిపారు.

విద్యలో ప్రతిభ చాటాలి

గండేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు విద్యారంగంలో ప్రతిభచూపి ఉన్నత స్థాయికి వెళ్లి తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకురావాలని గండేపల్లి ఎస్‌ఐ శివ నాగబాబు అన్నారు. ఆయన గురువారం పోలీస్ అమరవీరుల దినోత్సవంలో భాగంగా పలు పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పోలీసులు ఉపయోగించే పరికరాలు, పోలీస్‌స్టేషన్ ఎలా ఉంటుంది, ఎఫ్ఐఆర్ చేసే విధానం, పలు అంశాలపై అవగాహన కల్పించా రు. ముఖ్యంగా ఆడపిల్లలు బహుమతులకు ఆకర్షితులు కాకూడదని తమకు ఏ అవసరం ఉన్న తల్లి దండ్రులు చెప్పాలని సూచించారు.

ఆధార్‌కార్డు లేని ప్రతి విద్యార్థి ఆధార్ చేయించుకోవాలి



ఆధార్ సెంటర్ ను పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్య రెడ్డి

గండేపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):ఆధార్ కార్డు లేని ప్రతి విద్యార్థి కార్డు చేయించుకోవాలని ఎంపీడీవో కె.హరికృష్ణ సత్య రెడ్డి అన్నారు. మండలంలో నీతాద్రిరావుపేటలో ఉన్న శ్రీ సహస్ర విద్య నికేతన్, తాళ్లూరు శ్రీ కిరణ్ స్కూల్లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఆధార్ కార్డు లేని విద్యార్థులు ఆధార్ కార్డులు చేయించుకునేందుకు ఈ సెంటర్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవ కావాన్ని ప్రతిఒక్క రూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మోల్ డే

జగ్గంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):స్థానిక జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ దేవరపల్లి చెన్నారావు నేతృత్వంలో రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మోల్ డే ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రసాయనశాస్త్రంలో మోల్ అనే భావన చాలా ప్రముఖ మైన పాత్ర పోషిస్తుందని, రసాయన శాస్త్రాన్ని అభ్యసించే ప్రతి విద్యార్థి మోల్ గురించి తప్పనిసరిగా తెలుసుకోవాలని, మోల్ లేదా అవగాడ్రో సంఖ్య గుర్తుకి వచ్చే విధంగా ప్రతీ సంవత్సరం అక్టోబర్ 23న మోల్ డేని కళాశాలలో నిర్వహిస్తామని తెలిపారు. రసాయనశాస్త్ర అధ్యాపకుడు వారణాసి మల్లికార్జునశర్మ విద్యార్థులకు మోల్ ప్రాధాన్యతను, మోల్‌కు ఇతర పదాలకు మధ్య ఉన్న సంబంధాలను వివరి ంచారు. ఈ సందర్భంగా మోల్, రసాయన శాస్త్రంలో దాని అనువర్తనాలు అనే అంశంపై నిర్వహించిన జాతీయ స్థాయి ఆన్‌లైన్ క్విజ్‌లో వివిధ రాష్ట్రాలనుంచి 250 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. వైస్‌ప్రిన్సిపాల్ బాలరాజు, గణిత విభాగాధిపతి ఝాన్సీ దేవి, ఫిజిక్స్ అధ్యాపకుడు గోపాలకృష్ణ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కిర్లంపూడిలో ఆకట్టుకున్న గౌరీదేవి వేషధారణలు

కిర్లంపూడి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఎల్లపు వారి వీధిలో గౌరీ దేవి అమ్మవారి ఉత్సవాల్లో వేషధారణలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. గౌరీ సంఘం నాయకులు పెంటకోట శ్రీరాములు, సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు మాట్లాడుతు ప్రతి మూడు సంవత్సరములకు ఒకసారి గౌరీదేవిని నెలకొల్పడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పద్మ

తొండంగి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తొండంగి మండలంలో ఏర్పాటైన పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చంద్రమళ్ళ పద్మ డిమాండ్ చేసారు. గురువారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద జరిగిన మండల మహాసభలో ఆమె మాట్లాడారు. ఏ రంగంలో పని చేసే కార్మికులకైనా కనీస వేతనం 26 వేలు ఉండాలని, స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని తదితర అంశాలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలన్నారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో నూతన కమిటీ కన్వీనర్‌గా మచ్చా కామేశ్వరి, సభ్యులుగా మేరీ సమాధానం, శేషుకుమారి, సుబ్బలక్ష్మి, శాంతకుమారి, అరుణ, దుర్గ, చల్లారాణి , శామ్యూల్ లు ఎన్నికయ్యారు. సంఘనాయకులు నక్కెళ్ళ శ్రీను, ధనలక్ష్మి , దివ్య పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా మూర్తి



డిప్యూటీ ఎంపీడీవో మూర్తిని అభినందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

తొండంగి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీవోగా జీఎస్ఎన్ మూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ కాకినాడరూరల్ వలసపాకల గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఆయన పదోన్నతిపై తొండంగి వచ్చారు. పంచాయతీ కార్యదర్శిలు ప్రేమ్‌కుమార్, రాజబాబు. రాము, సురేష్, సత్యవెంకట్, శ్రీనివాసరావు, రామారావు, శంకర్ తదితరులతోపాటు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడిని మూర్తి కలిశారు.